Website: www.subhatelangana.in

RNI-TELTEL/2017/72695

బుధవారం
16 అక్టోబర్ 2024

ఎడిటర్:
నాగళ్ళ చంద్రశేఖర్

సంపుటి : 8
సంచిక : 159
పేజీలు : 6
వెల : 3/-

# శుభ తెలంగాణ

మేడ్చల్

ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక

Circulated at Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Khammam, Nalgonda, Nizambad, Medak, Adilabad, Mahaboobnagar

## మోగిన ఎన్నికల నగారా..

- మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల షెడ్యూల్ ఇదే
- మహారాష్ట్రలో మొత్తం 288 స్థానాలకు ఒకే విడతలో ఎన్నికలు
- అక్టోబర్ 22న నోటిఫికేషన్ విడుదల.. 29వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ
- నవంబర్ 20న ఎన్నికలు నిర్వహించి.. 23న ఫలితాల వెల్లడి
- జార్ఖండ్ 81 అసెంబ్లీ స్థానాలకు గానూ రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు
- తొలి విడతలో 43 స్థానాలకు నవంబర్ 13న ఎన్నికలు
- మీడియాకు స్వీయ నియంత్రణ అవసరం. ఎన్నికల ప్రక్రియ మొత్తం వెబ్‌కాస్టింగ్ చేస్తున్నాం
- ఫిర్యాదుల స్వీకరణకు సీ విజిల్ యాప్ అందుబాటులో ఉంటుంది
- సీఈసీ రాజీవ్ కుమార్






## ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుంది

- ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విరివిగా తీస్కెళ్లాలి
- క్రమశిక్షణ అనేది చాలా కీలకం.. క్రమశిక్షణ ఉల్లంగిస్తే ఊరుకునేది లేదు
- మెదక్ జిల్లా సమావేశంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

శుభ తెలంగాణ హైదరాబాద్

రాష్ట్రములో ప్రజల ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.మంగళవారం గాంధీ భవన్ లో జరిగిన మెదక్ జిల్లా నేతల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు.ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మనం ముందున్నం,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు అద్భుతమైన పాలన చేస్తున్నా రన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఇస్తున్నాం.. ఉద్యోగాల కల్పన చేసాము.బస్‌లలో - మిగతా 3లో

## నౌకా దళానికి రామబాణం

- దేశ రక్షణలో మరో ముందడుగు వీఎల్ఎఫ్ స్టేషన్
- రియల్ టైం కమ్యూనికేషన్‌లో అత్యంత కీలకం
- నౌకల మధ్య మెరుగైన సమన్వయానికి దోహదం
- అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మాణం
- పర్యావరణానికి హాని కలిగించకుండా స్టేషన్
- స్థానికులకు ఉద్యోగాలు.. పరిసరాల్లో ఆర్థికాభివృద్ధి
- అవసరమైతే స్థానికులకు పునరావాస ఏర్పాట్లు
- సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయాలను పక్కనబెట్టి.. దేశ హితం ముఖ్యమని చాటారు: రాజ్‌నాథ్‌సింగ్




శుభ తెలంగాణ హైదరాబాద్

దేశ రక్షణ దళాలకు అత్యంత అధునాతన ఆయుధాలు సమకూర్చడం ఎంత కీలకమో.. అధునాతన కమ్యూనికేషన్ వ్యవస్థ కూడా అంతే కీలకమని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. యుద్ధ సమయంలో గెలుపోటములను రియల్ టైం కమ్యూనికేషన్ నిర్ణయిస్తుందని, ప్రస్తుతం ప్రపంచ యుద్ధ పరిణామాలను గమనిస్తే ఈ విషయం స్పష్టమవుతుందని పేర్కొన్నారు. ఈ దిశగా తెలంగాణలో ఏర్పాటు కాబోతున్న వీఎల్ఎఫ్ నేవీ రేడార్ కేంద్రం దేశ రక్షణలో అత్యంత కీలకంగా మారనుందన్నారు. ముఖ్యంగా నౌకాదళాలకు ఈ స్టేషన్ రామబాణం కానుందన్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా - మిగతా 3లో

## ఇందిరమ్మ రాజ్యమని దళారుల రాజ్యం తెచ్చారు

- వెంటనే రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లు చెల్లించాలి
- గురుకుల భవనాలకు అద్దె చెల్లిస్తలేరు
- కాలేజీల యాజమాన్యాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తలేరు
- లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో రేవంత్ రెడ్డి సర్కార్ చెలగాటమాడుతోంది.
- ట్విటర్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు



శుభ తెలంగాణ హైదరాబాద్

రాష్ట్రంలో విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా భ్రష్టు పట్టించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లను వెంటనే చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గురుకుల భవనాలకు అద్దె చెల్లిస్తలేరు. కాలేజీల యాజమాన్యాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తలేరు. కనీసం అన్నం పెట్టలేని స్థితికి కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారిందని కేటీఆర్ విమర్శించారు. చదువు పక్కనపెట్టి విద్యార్థులు, కాలేజీ యాజమాన్యాలు రోడ్లపై ధర్నాలు చేసే దుస్థితి తెచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, పీజీ ప్రైవేట్ కాలేజీలను నిరవధికంగా మూసివేయటంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు - మిగతా 3లో

## అమెరికా-భారత్ మధ్య భారీ డిఫెన్స్ డీల్..

- రూ.31వేలకోట్లతో ప్రిడేటర్ డ్రోన్స్ కొనుగోలుకు ఒప్పందం..
- ఈ ఒప్పందం విషయంలో ఇరుదేశాల మధ్య చాలాకాలంగా చర్చలు
- ఈ డ్రోన్ల సహాయంతో మరింత పెరగనున్న భారతదేశ నిఘా సామర్థ్యం
- ఈ ఒప్పందానికి రక్షణ వ్యవహారాల కేబినెట్ కమిటీ గతవారం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే
- 15 డ్రోన్స్ నేవికి, మరో ఎనిమిది వైమానిక దళం, మరో ఎనిమిది ఆర్మీకి కేటాయింపు






## గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షకు లైన్ క్లియర్

- వివిధ కారణాలతో గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలపై హైకోర్టులో అభ్యర్థులు పలు పిటిషన్లు
- గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలపై దాఖలైన రెండు పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది.
- ప్రిలిమీనరీ కీ లో తప్పులు ఉన్నాయని, కీ ని రీ నోటిఫికేషన్ చేయాలని మరో పిటిషన్‌ను అభ్యర్థులు దాఖలు

శుభ తెలంగాణ హైదరాబాద్

గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షకు లైన్ క్లియర్ అయ్యింది. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పిటిషన్లను హైకోర్టు డిస్మిస్ చేసింది. వివిధ కారణాలతో గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలపై హైకోర్టులో అభ్యర్థులు పలు పిటిషన్‌లు దాఖలు చేశారు. మంగళవారం ఉదయం ఈ పిటిషన్లపై హైకోర్టులో విచారణకు వచ్చింది. - మిగతా 3లో

## సీతక్క, ఉత్తమ్‌లకు కీలక బాధ్యతలు

- మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికల ప్రచారానికి తెలంగాణ నేతలు
- జార్ఖండ్ సీనియర్ పరిశీలకుడిగా భట్టి విక్రమార్క
- మరాట్వాడా డివిజన్‌కు సచిన్ పైలట్, ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ఉత్తర మహారాష్ట్ర డివిజన్‌కు సీతక్క, డాక్టర్ నసీర్ హుస్సేన్
- ముంబయి, కొంకన్, విదర్భా, పశ్చిమ మహారాష్ట్ర డివిజన్లకు సీనియర్ నేతలు ముకుల్ వాస్నిక్, అవినాశ్ పాండే



శుభ తెలంగాణ హైదరాబాద్/ఢిల్లీ

మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ పరిశీలకులను నియమించింది. ఇందుకు సంబంధించి ఏఐసీసీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ జాబితాలో తెలంగాణ నుంచి ముగ్గురికి చోటు కల్పించింది. మహారాష్ట్రలో ని 5 డివిజన్లకు 11 మందిని నియమించగా.. వీరిలో తెలంగాణ నుంచి మంత్రులు సీత ^క్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. జార?ండ్?కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు ఆ పార్టీ సీనియర్ నేతలు అధిర్ రంజన్ చౌదరి, తారిక్ అన్వర్‌ని - మిగతా 3లో

# అమెరికా-భారత్ మధ్య భారీ డిఫెన్స్ డీల్

అగ్రరాజ్యం అమెరికాతో భారీ డీల్ కుదుర్చుకున్నది. 31 ప్రిడేటర్ డ్రోన్లను కొనుగోలు చేసేందుకు ఇరుదేశాలు ఒప్పందాలపై సంతకాలు చేసినట్లు ఓ అధికారి వెల్లడించారు. ఈ ఒప్పందం విషయంలో ఇరుదేశాల మధ్య చాలాకాలంగా చర్చలు జరుగుతున్నాయి. ఈ డీల్ రూ.32వేలకోట్ల విలువ ఉంటుందని ఆ అధికారి పేర్కొన్నారు. ఈ డ్రోన్ల సహాయంతో భారతదేశ నిఘా సామర్థ్యం మరింత పెరగనున్నది. ఈ ఒప్పందానికి రక్షణ వ్యవహారాల కేబినెట్ కమిటీ గతవారం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. భారత్‌లో జరిగిన కార్యక్రమంలో ఇరు దేశాల ఉన్నతాధికారులు, సైనికాధికారుల సమక్షంలో ఒప్పందం కుదిరింది. హిందూ మహాసముద్రంలో భారత్ నిఘా సామర్థ్యం భారీగా పెరగనుంది. గత ఏడాది ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా 31 ప్రిడేటర్ డ్రోన్‌లను కొనుగోలుపై భారత్ రక్షణ ఒప్పందాన్ని ప్రకటించింది. ఒప్పందంపై యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ మాట్లాడుతూ.. రెండుదేశాల మధ్య వ్యూహాత్మక సాంకేతిక సహకారం, సైనిక సహకారాన్ని గణనీయంగా పెంచుతుందని చెప్పారు. ప్రిడేటర్ డ్రోన్స్ ఎంక్యూ-9బీ కొనుగోలుతో హిందుమహాసముద్రంలో భారత నైకాదళం నిఘా సామర్థ్యం భారీగా పెరుగుతుందని రక్షణరంగ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ



ప్రిడేటర్ డ్రోన్‌లను అమెరికన్ కంపెనీ జనరల్ అటామిక్స్ నుంచి కొనుగోలు చేయనున్నారు. భారత్, అమెరికా మధ్య విదేశీ సైనిక ఒప్పందం ప్రకారం ఈ డీల్ జరిగింది. డీల్‌లో భాగంగా 31 ప్రిడేటర్ డ్రోన్లను అమెరికా భారత్‌కు అందించనున్నది.

డ్రోన్ల నిర్వహణ, మరమ్మతులను దేశంలోనే చేసేందుకు ఫెసిలిటీని ఏర్పాటు చేయనున్నారు. ఇందులో 15 డ్రోన్స్ నేవికి, మరో ఎనిమిది వైమానిక దళం, మరో ఎనిమిది ఆర్మీకి కేటాయించనున్నారు. హిందూ మహాసముద్రంలో చైనా తన ప్రాభవాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నది. ఈ క్రమంలోనే భారత్ సైతం తన నిఘా సామర్థ్యాన్ని మరింత పెంచుకుంటూ వస్తున్నది. ఈ ప్రిడేటర్ డ్రోన్స్ ప్రత్యేక ఏంటంటే.. దాదాపు 40వేల అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో దాదాపు 40 గంటలు ఎగురుతాయి. రకరకాల వాతావరణ పరిస్థితుల్లోనూ ఎగిరే సత్తా వీటి సొంతం. ప్రిడేటర్ డ్రోన్లను మానవతా సహాయం, విపత్తుల సమయంలో శోధన, రెస్క్యూ ఆపరేషన్, యాంటీ-సర్ఫేస్ వార్‌ఫేర్, యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్, ఎయిర్‌బోర్న్ మైన్ కౌంటర్‌మెజర్లు ఉపయోగించవచ్చు. దాడులు సైతం చేయొచ్చు. 2022 జూలైలో ఈ డ్రోన్ సహాయంతో యూఎస్ హెల్‌ఫైర్ క్షిపణిని ప్రయోగించి అల్‌ఖైదా ఉగ్రవాది ఐమన్ అల్ జవహరిని హతమార్చింది. ఈ డ్రోన్ హెల్‌ఫైర్ క్షిపణితో పాటు 450 కిలోల పేలుడ్‌తో ఎగురుతుంది. ప్రిడేటర్ డ్రోన్‌లను తయారు చేసే జనరల్ అటామిక్స్, ఈ డ్రోన్ భాగాలను తయారు చేయడానికి భారత కంపెనీ భారత్ ఫోర్జ్‌తో ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డ్రోన్‌ల మరమ్మతులు, నిర్వహణ కోసం కంపెనీ భారతదేశంలోనే ఎంఆర్‌వో హబ్‌ను కూడా ఏర్పాటు చేస్తుంది. దాంతో పాటు కంపెనీ తన సొంత స్వదేశీ యుద్ధ డ్రోన్‌లను తయారు చేయడానికి భారత్‌కు సహకారం అందించనున్నది.

# మోగిన ఎన్నికల నగారా..

**న్యూఢిల్లీ:** దేశంలో మరోసారి ఎన్నికల నగారా మోగింది. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. మహారాష్ట్రలో మొత్తం 288 స్థానాలకు ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఈసీ ప్రకటించింది. ఇందుకోసం అక్టోబర్ 22న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు పేర్కొంది. 29వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణకు గడువు ఉండగా.. నామినేషన్ల ఉపసంహరణకు నవంబర్ 4 వరకు గడువు ఉంటుంది. ఇక నవంబర్ 20న ఎన్నికలు నిర్వహించి.. 23న ఫలితాలు వెల్లడించనున్నట్లు ఈసీ వివరించింది. రాష్ట్రంలో మొత్తం 9 కోట్ల 63 లక్షల మంది ఓటర్లు ఉండగా.. లక్షా 186 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. కాగా, నవంబర్ 26తో మహారాష్ట్ర అసెంబ్లీ గడువు ముగియనుంది.

మరోవైపు జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు కూడా ఈసీ షెడ్యూల్ విడుదల చేసింది. 81 అసెంబ్లీ స్థానాలకు గానూ రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. తొలి విడతలో 43 స్థానాలకు నవంబర్ 13న ఎన్నికలు జరగనున్నాయి. మిగిలిని 38 స్థానాలకు నవంబర్ 20న ఎన్నికలు ఉంటాయి. ఇక నవంబర్ 23న ఓట్ల లెక్కింపు చేపట్టి.. ఫలితాలు వెల్లడిస్తారు. రాష్ట్రంలో మొత్తం 2.6 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. 29,562 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఈసీ తెలిపింది. ఇక వచ్చే ఏడాది జనవరి 5తో జార్ఖండ్ అసెంబ్లీ గడువు ముగియనుంది.

ఈ సందర్భంగా సీఈసీ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియ మొత్తం వెబ్‌కాస్టింగ్ చేయనున్నట్లు తెలిపారు. ఫిర్యాదుల స్వీకరణకు సీ విజిల్ యాప్ అందుబాటులో ఉంటుందని చెప్పారు. మద్యం, డ్రగ్స్, కానుకలు పంపిణీ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని




హెచ్చరించారు. ఆన్‌లైన్ వాలెట్‌లపైనా నిఘా ఉంటుందని.. సోషల్ మీడియాలో వచ్చే వార్తలపై నిఘా పెడుతున్నట్లు సీఈసీ తెలిపారు.

మరోవైపు జమ్ము కశ్మీర్, హర్యానా అసెంబ్లీ ఎన్నికల నిర్వహణపై కూడా సీఈసీ రాజీవ్ కమార్ మాట్లాడారు. 'జమ్ము కశ్మీర్, హర్యానా ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాం. కశ్మీర్ ఎన్నికల నిర్వహణపై ప్రపంచ దేశాల నుంచి ప్రశంసలు అందాయి. ఉగ్రదాడులకు భయపడకుండా ప్రజలు ఓటేశారు. హింసాత్మక ఘటనలు ఒక్కటీ జరగకుండా ఎన్నికలు నిర్వహించాం. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించినా కొందరు విమర్శలు చేస్తున్నారు' అని అన్నారు.

### ఎగ్జిట్ పోల్స్‌పై ప్రధాన ఎన్నికల కమిషనర్ కీలక వ్యాఖ్యలు

ఎగ్జిట్ పోల్స్ శాస్త్రీయతపై ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ కీలక ప్రశ్నలు సంధించారు. శాంపిల్ సైజ్, సర్వేలు ఎక్కడ జరిగాయి? అందుకు అనుగుణంగా ఫలితాలు రాకుంటే బాధ్యులెవరు? అని ప్రశ్నించారు. దీనిపై భాగస్వామ్య పక్షాలు ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. మీడియాకు స్వీయ నియంత్రణ అవసరమని అన్నారు. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన సందర్భంగా ఆనయ ఈ కీలక వ్యాఖ్యల చేశారు. ఎగ్జిట్స్ పోల్స్‌తో తమకు ఎలాంటి సంబంధం ఉండదని, వాటికి ఎలాంటి శాస్త్రీయత లేనప్పటికీ భారీ అంచనాలనే సృష్టిస్తాయని చెప్పారు. ఇందువల్ల ప్రజల్లో గంగరగోళం ఏర్పడుతోందని, మీడియా ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియా ఆత్మపరిశీలన చేసుకోవాల్సి అవసరం ఉందని, స్వీయ నియంత్రణ అవసరమని సీఈసీ అన్నారు. ఓట్ల లెక్కింపు మొదలైన 15 నుంచి 30 నిమిషాల్లోనే టీవీ ఛానెల్స్ ఎర్లీ ట్రెండ్స్ చూపించడాన్ని సీఈసీ ప్రశ్నించారు. "ఎన్నికలు ముగిసిన సుమారు మూడోరోజు కౌంటింగ్ జరుగుతుంది. అయితే ఎన్నికలు ముగిసిన రోజు సాయంత్రం 6 గంటల నుంచే అంచనాలు పెరుగుతుంటాయి. కౌంటింగ్ మొదలైన తర్వాత 8.05-8.10 గంటల మధ్యనే ఫలితాలు మొదలు పెట్టేస్తారు. ఇదంతా నాన్సెన్స్. ఫస్ట్ కౌంటింగ్ 8.30 గంటలకు మొదలవుతుంది. తొలి ట్రెండ్స్ ఎగ్జిట్ పోల్స్‌ను జస్టిఫై చేస్తాయా?" అని రాజీవ్ కుమార్ ప్రశ్నించారు. ఉదయం 9.30 గంటలకు ఫలితాలు వెబ్‌సైట్‌లో పెట్టడం మొదలవుతుందని, వాస్తవ ఫలితాలు వచ్చేసరికి మిస్‌మ్యాచ్ కావచ్చని, ఒక్కోసారి ఇలాంటి మిస్‌మ్యాచ్ తీవ్ర సమస్యలకు కారణం కావచ్చని అన్నారు. అంచనాలు, ఫలితాలకు మధ్య అంతరం చివరకు నిరాశకు దారితీస్తుందన్నారు. దీనిపై మీడియా సహా సంబంధిత పార్టీలన్నీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. ఇటీవల ప్రకటించిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు భిన్నంగా రావడం, దీనిపై కొన్ని పార్టీలు ఆరోపణలు చేసిన నేపథ్యంలో రాజీవ్ కుమార్ తాజా వివరణ ఇచ్చారు.

# 48 అసెంబ్లీ, రెండు లోక్‌సభ స్థానాలకు ఉప ఎన్నికలు

**న్యూఢిల్లీ :** మహారాష్ట్ర, జార?ండ్ అసెంబ్లీ ఎన్నికలతోపాటు దేశ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న రెండు లోక్‌సభ, 48 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలకు షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ఇవాళ ప్రకటించింది.

కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానంతో పాటు దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 47 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 13న ఉప ఎన్నికలు ఉంటాయని తెలిపింది. ఇందుకోసం అక్టోబర్ 18న నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. 25న నామినేషన్ల స్వీకరణకు చివరి గడువు కాగా.. నామినేషన్ల ఉపసంహరణకు 30వ తేదీ వరకూ గడువు ఇచ్చింది.

ఇక నవంబర్ 13న ఎన్నికలు ఉంటాయి. 23వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తారు. దీంతోపాటు ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ అసెంబ్లీ స్థానానికి, మహారాష్ట్రలోని నాందేడ్ లోక్ సభ స్థానానికి నవంబర్ 20న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. 23న ఫలితాలు వెల్లడిస్తారు.




వయనాడ్ ఉప ఎన్నిక తేదీని ప్రకటించిన సీఈసీ

లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ రాజీనామా నేపథ్యంలో వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నిక షెడ్యులను కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) ప్రకటించింది. నవంబర్ 13వ తేదీన ఈ లోక్‌సభ నియోజకవర్గ ఉప ఎన్నికను నిర్వహించనున్నట్లు సీఈసీ వెల్లడించింది. మహారాష్ట్ర, జార?ండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాజీవ్ కుమార్ మంగళవారం న్యూఢిల్లీలో ప్రకటించారు. అదే సమయంలో దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని అసెంబ్లీ, లోక్‌సభ ఉప ఎన్నికల షెడ్యూల్‌ను సైతం ఆయన విడుదల చేశారు. ఆ క్రమంలో నవంబర్ 13వ తేదీన వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు.


వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నిక ఎందుకు జరుగుతుంది?

కేరళలోని వాయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి రాహుల్ గాంధీ వరుసగా రెండు సార్లు గెలుపొందారు. అయితే గత లోక్‌సభ ఎన్నికల్లో అంటే.. 2019లో అమేఠీతోపాటు వయనాడ్ నుంచి రాహుల్ గాంధీ బరిలో దిగారు. కానీ ఆ ఎన్నికల్లో అమేఠీలో బీజేపీ ఎంపీ అభ్యర్థి స్మృతి ఇరానీ చేతిలో రాహుల్ ఓటమి పాలయ్యారు. ఇక వయనాడ్‌లో రాహుల్ విజయం సాధించారు. అలాగే 2024 లోక్‌సభ ఎన్నికల్లో వయనాడ్ నుంచి రాహుల్ గెలుపొందారు. ఇక రాయబరేలి నుంచి



సైతం ఆయన గెలుపొందారు. అయితే గెలిచిన కొద్ది రోజులకు ఈ రెండు నియోజకవర్గాల్లో ఏదో ఒక దానికి ఆయన రాజీనామా చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో వయనాడ్ లోక్‌సభ స్థానానికి రాహుల్ గాంధీ రాజీనామా చేశారు. దీంతో ఈ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఇటువంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రియాంక గాంధీ.. ఈ స్థానం నుంచి బరిలో దిగుతారనే ఓ ప్రచారం అయితే జోరుగా సాగుతుంది. ఎందుకంటే.. ఈ నియోజకవర్గ ప్రజలు వరుసగా రెండు సార్లు రాహుల్ గాంధీకి పట్టం కట్టారు. అలాగే ప్రియాంక గాంధీ సైతం పోటీ చేస్తే.. వయనాడ్ ప్రజలు ఆమెకు విజయం కట్టబెడతారనే ఓ ప్రచారం అయితే బలంగా సాగుతుంది. అదీకాక ఇటీవల భారీ వర్షాలు వరదలతో వయనాడ్ జిల్లాలోని పలు గ్రామాలు అతలాకుతలమైంది. భారీ నష్టం సైతం సంభవించింది. ఆ సమయంలో రాహుల్, ప్రియాంక గాంధీలు ఆయా గ్రామాల్లో సైతం పర్యటించారు. అలాగే ఆ గ్రామాల ప్రజలతో సైతం వారు నేరుగా సంభాషించారు. వయనాడ్‌లో సంభవించిన ప్రకృతి ప్రళయాన్ని జాతీయ విపత్తుగా పరిగణించాలంటూ కేంద్ర ప్రభుత్వానికి రాహుల్ గాంధీ పలుమార్లు విజ్ఞప్తి చేశారు. అయినా కేంద్రం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిన విషయం విధితమే. ఇక ప్రధాని మోదీ సైతం వయనాడ్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. కానీ వయనాడ్‌లో జరిగిన నష్టాన్ని మాత్రం ప్రకృతి విపత్తుగా కేంద్రం ప్రకటించకపోవడం గమనార్హం.

## ఐఏఎస్‌లకు చుక్కెదురు




తాము ప్రస్తుతం విధులు నిర్వర్తించే చోటే కొనసాగించేలా ఉత్తర్వులు ఇవ్వాలంటూ కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించిన తెలంగాణ, ఏపీ ఐఏఎస్ అధికారులకు చుక్కెదురైంది. వారి పిటిషన్లపై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు క్యాట్ నిరాకరించింది. గతంలో ఏపీకి కేటాయించినా ఇంకా తెలంగాణలోనే విధులు నిర్వర్తిస్తున్న ఆమ్రపాలి, వాణీప్రసాద్, వాకాటి కరుణ... తెలంగాణకు కేటాయించినా ఏపీలో విధులు నిర్వర్తిస్తున్న సృజనను తమ సొంత క్యాడర్ రాష్ట్రాలకు వెళ్లాల్సిందిగా ఇటీవల డీవోపీటీ ఆదేశాలు ఇచ్చింది. అయితే, డీవోపీటీ ఆదేశాలను సవాల్ చేస్తూ పై నలుగురు ఐఏఎస్ లు క్యాట్ లో పిటిషన్లు దాఖలు చేశారు. డీవోపీటీ ఆదేశాలపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని క్యాట్ ను కోరారు. ఈ పిటిషన్లపై క్యాట్ నేడు విచారణ చేపట్టింది. ఐఏఎస్ అధికారుల తరఫున న్యాయవాదులు వాదనలు వినిపించారు. డీవోపీటీ ఉత్తర్వులు రద్దు చేయాలని కోరుతున్నామని వారు క్యాట్ కు విన్నవించారు. ఈ నెల 16న రిలీవ్ కావాలని డీవోపీటీ ఆదేశాలు ఇచ్చిందని, అయితే, హైకోర్టు ఆదేశాల మేరకు ఐఏఎస్ ల అభ్యర్థనను డీవోపీటీ పరిశీలించాలని న్యాయవాదులు కోరారు. డీవోపీటీ నేరుగా నిర్ణయం తీసుకోకుండా, ఏక సభ్య కమిటీని నియమించిందని, కానీ, ఐఏఎస్ ల కేటాయింపుపై నిర్ణయాధికారం డీవోపీటీకే ఉంటుందని వారు స్పష్టం చేశారు. అలాంటప్పుడు ఏక సభ్య కమిటీ సిఫారసును డీవోపీటీ ఎలా అమలు చేస్తుందని న్యాయవాదులు ప్రశ్నించారు. ఏక సభ్య కమిటీ డీవోపీటీకి ఇచ్చిన నివేదికను ఐఏఎస్ లకు ఇవ్వలేదని వారు క్యాట్ దృష్టికి తీసుకెళ్లారు. కమిటీ నివేదికను ఐఏఎస్ అధికారులకు ఇవ్వకుండానే డీవోపీటీ ఉత్తర్వులు ఇచ్చిందని ఆరోపించారు. ఈ వాదనలు విన్న క్యాట్ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. వరదల కారణంగా ఏపీలో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, అలాంటప్పుడు ఏపీకి వెళ్లి వరద ప్రాంతాల్లో ప్రజలకు సేవ చేయాలని లేదా? అని సూటిగా ప్రశ్నించింది. డీవోపీటీ ఏక సభ్య కమిటీని నియమించినప్పుడే ఐఏఎస్ లు ఎందుకు స్పందించలేదని నిలదీసింది. ఎందుకు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేయలేదని క్యాట్ ప్రశ్నించింది. ఇలాంటి పరిస్థితుల్లో డీవోపీటీ ఆదేశాలపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది.

## ఎయిర్ ఇండియా విమానానికి బాంబు బెదిరింపు.. అయోధ్యలో అత్యవసర ల్యాండింగ్..!



ఎయిర్ ఇండియా విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. దాంతో విమానాన్ని అయోధ్య విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. ఈ సమయంలో విమానంలో 139 మంది ప్రయాణీకులు ఉన్నారు. విమానం అత్యవసర ల్యాండింగ్ నేపథ్యంలో విమానాశ్రయంలో అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఎయిర్ ఇండియాకు చెందిన విమానం జైపూర్ నుంచి బయలుదేరగా.. అధికారుల ఆదేశాల మేరకు పైలట్లు విమానాన్ని అయోధ్యలోని మహర్షి వాల్మీకి విమానాశ్రయంలో సేఫ్‌గా ల్యాండ్ చేశారు. ఆ తర్వాత అధికారులు విమానంలో తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు కనిపించకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. సీనియర్ ఎస్పీ రాజ్‌కరణ్ నయ్యర్ ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. అనంతరం ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా పరిస్థితిపై మీడియా ఆయనను ప్రశ్నించగా.. స్పందించేందుకు నిరాకరించారు. మరో వైపు ఏటీఎస్ సైతం విమానాశ్రయానికి చేరుకున్నది. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందించేందుకు వచ్చానని, ప్రస్తుతానికి అలాంటి అవసరం లేదని ఓ అధికారి తెలిపారు. ప్రస్తుతం ఎస్ఎస్పీ, ఎస్పీ సిటీ సహా భద్రతా విభాగం అధికారులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో ఎయిర్ ఇండియా విమానానికి బాంబు బెదిరింపు రావడం ఇది రెండోసారి. ముంబయి నుంచి న్యూయార్క్‌కు బయలుదేరిన విమానానికి సైతం సోషల్ మీడియా వేదికగా బాంబు బెదిరింపు రావడంతో విమానాన్ని ఢిల్లీలో అత్యవసరంగా దింపారు. అంతకు ముందు సైతం ఇండోర్‌లోని దేవి అహల్యబాయ్ హెూల్కర్ విమానాశ్రయానికి సైతం బాంబు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే.

## మనదేశ డేటా మనవద్దే ఉండాలి: ఆకాశ్ అంబానీ



**న్యూఢిల్లీ:** స్వదేశీ కృత్రిమ మేధస్సు సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలని రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ చైర్మెన్ ఆకాశ్ అంబానీ పిలుపునిచ్చారు. ఢిల్లీలోని భారత మండపంలో జరుగుతున్న ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో ఆయన మాట్లాడారు. స్వదేశీ ఏఐ సామర్థ్యం, అప్లికేషన్స్ పెంచేందుకు.. స్వదేశీ డేటా సెంటర్లను కూడా అభివృద్ధి చేయాలన్నారు. ఇక భారత్‌కు చెందిన డేటాను భారత్‌లోనే ఉంచాలని ఆయన అభిప్రాయపడ్డారు. దీని కోసం డేటా సెంటర్ పాలసీని ప్రభుత్వం తీసుకురావాలని ఆయన కోరారు. మానవ మెదడు సృష్టించిన విప్లవాత్మకమైన సాధనం ఏఐ అని, మన జీవితాన్ని, సమాజాన్ని, ఆర్థిక వ్యవస్థను ఆ టూల్ మార్చేస్తుందన్నారు. 2047 నాటి వరకు వికసిత్ భారత్ సృష్టించాలన్న కలను సాకరం చేయడంలో కీలక పాత్ర పోషించనున్నట్లు చెప్పారు.

## ఫైవ్ ఐస్ దేశాలతో సమాచారం పంచుకున్నాం

**వాషింగ్టన్:** సిక్కు తీవ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జార్ హత్య కేసుపై కెనడా ప్రధాని జస్టిస్ ట్రూడో స్పందించారు. ఆ కేసుకు సంబంధించిన సమాచారాన్ని ఫైవ్ ఐస్ భాగస్వామ్య దేశాలతో పంచుకున్నట్లు ఆయన చెప్పారు. అమెరికాకు ఆ హత్య సమాచారాన్ని అందించినట్లు వెల్లడించారు. కెనడా జాతీయుడు నిజ్జార్ హత్య కేసులో భారతీయ దౌత్యవేత్తల పాత్ర ఉన్నట్లు ట్రూడో ఆరోపిస్తున్నారు. దానికి సంబంధించిన సమాచారాన్ని ఫైవ్ ఐస్ దేశాలకు చేరవేసినట్లు ఆయన చెప్పారు. సోమవారం ఆరుగురు కెనడా దౌత్యవేత్తలను భారత్ బహిష్కరించింది. ఇక కెనడాలో ఉన్న హై కమీషనర్లను కూడా వెనక్కి రప్పిస్తున్నట్లు భారత్ పేర్కొన్నది. ఈ నేపథ్యంలో కెనడా ప్రధాని ట్రూడో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. గత ఏడాది సమ్మర్ నుంచి నిజ్జార్ హత్య కేసులో ఫైవ్ ఐస్ దేశాలతో చర్చించామని, ముఖ్యంగా అమెరికాతో ఈ విషయాన్ని పంచుకున్నామని, భారత్ సాగిస్తున్న హత్యాకాండ గురించి సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకున్నట్లు ట్రూడో వెల్లడించారు. కూటమి దేశాలతో ఈ అంశంపై పనిచేయనున్నట్లు ఆయన చెప్పారు.

# నౌకా దళానికి రామబాణం..

-మొదటిపేజీ తరువాయి

దామగుండంలో కేంద్ర నౌకాదళం ఏర్పాటుచేయనున్న 'వెరీ లో ఫ్రీక్వెన్సీ స్టేషన్'కు రాజ్‌నాథ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేడార్ స్టేషన్ నిర్మాణ ప్రణాళిక కాగితాల నుంచి కా ర్యాచరణకు చేరుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో సహకరించారంటూ అభినందించారు. "దేశ ప్రయోజనాలకు సంబంధించి ఎంతో ప్రాముఖ్యం కలిగిన వీఎల్ఎఫ్ స్టేషన్‌కు మాజీ రాష్ట్రపతి, ప్రముఖ మిసైల్ శాస్త్రవేత్త అబ్దుల్ కలాం జయంతి రోజు శంకుస్థాపన చేయడం ఎంతో సంతోషంగా ఉంది. దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రవర్తించడం రాజకీయం కాదని తన ప్రసంగంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పడం అద్భుతమైన విషయం. రాజకీయమంటే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం కాదు.. దేశాన్ని ఏర్పాటు చేయడమన్న ఉద్దేశంతో ఆయన ఈ ప్రాజెక్టుకు పూర్తి సహాయ సహకారాలు అందించారు. ఇందుకు రేవంత్‌రెడ్డికి ప్రత్యేక అభినందనలు" అని రాజ్‌నాథ్ అన్నారు.



**నౌకాదళాలకు అత్యంత కీలకం..**

"నౌకాదళాలకు రియల్ టైం కమ్యూనికేషన్‌లో ఈ స్టేషన్ అత్యంత కీలకం కానుంది. సముద్రంలో ఉండే భారతీయ నౌకాదళం నౌకల మధ్య మరింత మెరుగైన కమ్యూనికేషన్ వ్యవస్థ దీంతో సమకూరనుంది. దేశ రక్షణకు సంబంధించి ఇది ఎంతో కీలకం కానుంది. మనిషి, యంత్రం మధ్యలో సమన్వయం ప్రస్తుత తరంలో ఎంతో కీలకంగా కానుందని రక్షణ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. మెరుగైన కమ్యూనికేషన్ వ్యవస్థ రక్షణ రంగంలో ఎంతో కీలకం. ఉన్నతస్థాయి ఆదేశాలను క్షేత్రస్థాయిలో పంపించడం, సత్వర నిర్ణయాలు అమలు చేయడం, క్షేత్రస్థాయి నుంచి ఫీడ్ బ్యాక్ సేకరణలో ఈ కేంద్రం ఎంతో ప్రాముఖ్యం కలిగి ఉండనుంది. గత వైఫల్యాలతో పాఠాలు నేర్చుకుని సురక్షిత భవిష్యత్తు కోసం దీనిని అభివృద్ధి చేస్తున్నాం. మన నౌకాదళం వద్ద పెద్దఎత్తున నౌకలున్నాయి. ఇండో పసిఫిక్ సముద్రం, బంగాళాఖాతంలో మన నౌకాదళం నౌకలు విస్తరించి ఉన్నాయి. దశాబ్దాలుగా ఫ్రాన్స్, ఆంగ్లేయులు సముద్రంపై ఆధిపత్యం చలాయిస్తూ వస్తున్నారు. నేడు మనం ఆ రంగంలో ఆధిపత్యం చలాయించాలంటే ఇలాంటి లో ఫ్రీక్వెన్సీ స్టేషన్ ఎంతో కీలకం. ఇది పూర్తి గా అత్యాధునిక టెక్నాలజీపై ఆధారపడి ఉంటుంది. భవిష్యత్తు అవసరాలకూ ఇది ఎంతో కీలకం కానుంది. వచ్చే ఎన్నో దశాబ్దాల వరకు మన నౌకాదళానికి ఈ కేంద్రం సురక్షితమైన కమ్యూనికేషన్ల వ్యవస్థను అందిస్తుంది. భారతీయ నౌకాదళాన్ని మరింత పటిష్ఠం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇలాంటి స్టేషన్ల నిర్మాణంతో మన దళాలను అత్యాధునిక, ఆత్మ నిర్భర్‌గా చేస్తున్నాం" అని రాజ్‌నాథ్ వివరించారు.

**పర్యావరణ సమస్యలుండవు..**

"పర్యావరణ సమస్యలంటూ ఈ కేంద్రం గురించి స్థానికుల్లో అనేక అపోహలు వ్యాప్తి చేశారు. మీ అందరికీ నేను మాటిస్తున్నా.. పర్యావరణ సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. ఎలాంటి పర్యావరణ సమస్యలు రాకుండా నిర్మాణం ఉంటుందని ఇప్పటికే నేవీ చీఫ్ అడ్మిరల్ పేర్కొన్నారు. నేను కూడా స్పష్టం చేస్తున్నా.. పర్యావరణానికి విఘాతం కలగకుండా స్టేషన్ నిర్మాణం ఉంటుంది. ఈ కేంద్రం నిర్మాణంలో అవసరమైతే స్థానికుల పునరావాసం గురించి కూడా ఏర్పాట్లు చేస్తాం. తమిళనాడు తిరునల్వేలిలోని ఐఎన్ఎస్ కట్టబొమ్మన్ వీఎల్ఎస్ ట్రాన్స్‌మిషన్ కేంద్రం గత 35 ఏళ్లుగా నౌకాదళాలకు సేవలందిస్తోంది. అక్కడ స్థానికంగా ఎలాంటి పర్యావరణ సమస్యలు రాలేదు. ఎవరైనా వెళ్లి చూడవచ్చు. ఈ కేంద్రం నిర్మాణంలో, పూర్తయ్యాక స్థానికులకు ఉద్యోగ అవకాశాలూ ఇస్తామని హామీ ఇస్తున్నా. ఇది కేవలం ఉపాధి అవకాశాల కోసమే కాదు.. పరిసర ప్రాంతాల అభివృద్ధికీ గ్రోత్ పోల్‌గా మారనుంది. శాంతికి సంబంధించిన అతిపెద్ద గ్యారంటీ మన నౌకాదళం. బంగాళాఖాతం, భారత సముద్ర జలాల్లో శాంతిని కొనసాగించడం మన ప్రాధాన్యం కావాలి. భారత్ చేస్తున్న ఈ ప్రయత్నంలో స్నేహపూర్వక దేశాలన్నీ కలిసి నడుస్తున్నాయి. మన పొరుగు దేశాలతోనూ స్నేహపూర్వకంగా ముందుకు వెళ్తున్నాం. దేశ రక్షణ విషయం వస్తే కులమతాలకు అతీతంగా అందరూ ఏకమవుతారని ఇక్కడి స్థానికులు చాటిచెప్పారు. ఇతర రాజకీయ పక్షాలు కూడా దేశ సురక్ష విషయంలో అంతా ఏకమై వచ్చారు" అని రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు.

**రాజ్‌నాథ్‌కు ఘనస్వాగతం**

బేగంపేట: దామగుండం ప్రాజెక్టు శంకుస్థాపనకు వచ్చిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాత్‌సింగ్‌కు మంగళవారం బేగంపేట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఉదయం 11.35 గంటలకు బేగంపేటకు చేరుకున్న రాజ్‌నాథ్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ స్వాగతం పలికారు. శంకుస్థాపన పూర్తయిన అనంతరం 4.18 గంటలకు తిరిగి బేగంపేటకు చేరుకొని ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

# ఇందిరమ్మ రాజ్యమని దళారుల రాజ్యం తెచ్చారు

-మొదటిపేజీ తరువాయి

చెల్లించకుండా పేద విద్యార్థులను చదువుకు దూరం చేస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

మూసీ కోసం రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేసే కాంగ్రెస్ సర్కార్ దగ్గర అద్దె, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఇవ్వటానికి పైసలు లేవా? రాష్ట్రానికి విద్యా శాఖ మంత్రి లేదు, ముఖ్యమంత్రికి విద్యారంగంలో సమస్యలను తెలుసు కునే ఓపిక లేదు. రాష్ట్రంలో విద్యార్థులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాల్సిందిపోయి.. ఎంతసేపు ఢిల్లీకి మూటలు పంపించే పనిలోనే ముఖ్యమంత్రి బిజీగా ఉన్నాడు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో రేవంత్ రెడ్డి సర్కార్ చెలగాట మాడుతోంది. ఢిల్లీకి మూటలు పంపించటంపై ఉన్న శ్రద్ధ.. విద్యార్థులకు మేలు చేయటంలో లేదా? కాలేజీలు నిరవధికంగా బంద్ చేస్తామని హెచ్చరించినా, సర్కారుకు చీమ కుట్టినట్లైనా లేదా? వెంటనే రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లు చెల్లించాలి. విద్యార్థులకు అన్యాయం చేస్తామంటే బీఆర్ఎస్ సహించదు అని కేటీఆర్ తేల్చిచెప్పారు.

**ఇందిరమ్మ రాజ్యమని దళారుల రాజ్యం తెచ్చారు: కేటీఆర్..**

తెలంగాణలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన నాటి నుంచి అన్నీ రంగాలు కుదేలయ్యాయని బీఆర్ఎస్ మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు అన్నారు. వ్యవసాయ, విద్యా, విద్యుత్ రంగాలు అధ్వానంగా మారాయని బీర్ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. గురుకులాల బిల్డింగులకు కనీసం అద్దె చెల్లించలేక విద్యార్థులను రోడ్డుపైకి తెచ్చారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలూ ట్విటర్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై



విమర్శలు గుప్పించారు.

**కేటీఆర్ ట్వీట్ ఇదే..**

"బడా భాయ్ (ప్రధాని మోదీ) రాష్ట్రంలో పత్తి రైతులకు పట్టాభిషేకం జరుగుతుంటే చోటా భాయ్ (రేవంత్ రెడ్డి) పాలనలో మాత్రం పత్తి రైతులు చిత్తు అయ్యారు. గుజరాత్‌లో మద్దతు ధరకు మించి క్వింటా పత్తి ధర రూ.8,257 పలుకుతోంది. కానీ తెలంగాణలో క్వింటా ధర కేవలం రూ.5వేలేనా?. రెండేళ్ల కిందట పత్తి క్వింటా ధర 10 నుంచి 15 వేల వరకూ పలికింది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పరిస్థితి మారింది. మార్కెట్‌కు దిగుబడి వచ్చినా సీసీఐ కేంద్రాలెక్కడ?. ఇందిరమ్మ రాజ్యమని దళారుల రాజ్యం తెస్తారా?. నిన్న పెట్టుబడి సాయం అందించలేదు, నేడు కష్టించి పండించినా పంట కొనుగోలు చేయరా?. పత్తి రైతుల జీవితాలతో కాంగ్రెస్ సర్కార్ చెలగాటం ఆడుతోంది. ముందుచూపు లేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వల్లే పత్తి రైతులకు రాష్ట్రంలో అన్యాయం జరుగుతోంది.

**బాదుడే బాదుడు..**

కరెంట్ కోతల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇప్పుడు వాతలు పెట్టేందుకు రెడీ అవుతోంది. విద్యుత్ సరఫరాకు గ్యారెంటీ లేదు కానీ విద్యుత్ షాకులకు మాత్రం గ్యారెంటీ ఇస్తోంది. పవర్‌లోకి వచ్చి ఏడాది కాకముందే పవర్ ఛార్జీలు పెంచి జనం మీద భారం మోపడానికి సిద్ధమయ్యారు. ఉచిత కరెంట్ ఇస్తామని చెప్పి దాన్ని అటకెక్కించారు. గృహజ్యోతి పథకం ఇంకా గ్రహణంలోనే ఉంది. జీరో బిల్లుల కోసం ఎదురు చూస్తుంటే గుండె గుబేలు మనేలా కొత్త బాదుడు షురూ చేస్తారా?. ఒక్క గ్యారెంటీ అయినా సరిగా అమలు చేసింది లేదు. 420 హామీలకు అతీగతీ లేదు. రాష్ట్ర ఖజానా ఖాళీ చేసి ఏం చేస్తున్నారు.?. 9 నెలల్లో ఎడాపెడా అప్పులు చేసి తెచ్చిన రూ.77వేల కోట్లు ఎటుపోయాయి?. అవి సరిపోక మళ్లీ ప్రజల నడ్డి విరిగే వడ్డనలు ఎందుకు?. అసమర్థుల పాలనలో ఆఖరికి మిగిలేది కోతలూ వాతలే" అని అన్నారు.

**అద్దెలు చెల్లించలేరా?**

"10 నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గురుకులాల పరిస్థితి అధ్వానంగా మారింది. అద్దె రాకపోవడంతో ఓ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ భవన యజమాన్ని పాఠశాలకు తాళం వేశారు. కాంగ్రెస్ పాలనలో గురుకులాల నిర్వహణ అధ్వాన స్థితికి చేరుకుందని చెప్పడానికే ఇది మరో నిదర్శనం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు.. గురుకులాలకు అద్దెలు ఇంకెప్పుడు చెల్లిస్తారు?. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థ రోజురోజుకీ దిగజారిపోతోంది. దీనిపై విద్యా శాఖ మంత్రిగా ఉన్న మీరు ఇంకెప్పుడు పట్టించుకుంటారు?" అని హరీశ్ రావు ట్వీట్ చేశారు.

# మళ్లీ ఢిల్లీకి రేవంత్

**హైదరాబాద్ :** సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం దిల్లీ బాటపట్టనున్నారు. ఈ మేరకు ఏఐసీసీ పెద్దలతో కీలక చర్చలు జరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే క్యాబినెట్ విస్తరణపై పార్టీ అగ్రనేతలతో భేటీ కానున్నట్లు సమాచారం. మరోవైపు గురువారం దిల్లీలో అత్యంత కీలకమైన సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహిస్తున్నారు. తెలంగాణ నుంచి కేవలం ఇద్దరు మాత్రమే ఈ భేటీలో పాల్గొన్ననున్నట్లు పార్టీ వర్గాలు అంటున్నాయి. సీఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ సైతం దిల్లీ వెళు న్నారట. దీంతో మంత్రి పదవిపై గంపెడు ఆశలు పెట్టుకున్న ఎమ్మెల్యేలు రేపటి సమావేశంపై ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారట. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపుగా 10 నెలలు గడిచిపోతోంది. అయితే చాలా కాలంగా వాయిదా పడుతూ వస్తున్న మంత్రివర్గ విస్తరణ అంశాన్ని ఈసారి సాధించుకువస్తారని తెలుస్తోంది. గత డిసెంబర్ లో ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. అయితే అప్పట్నుంచి నేటివరకు పూర్తి స్థాయిలో మంత్రివర్గ విస్తరణ పలుమార్లు వాయిదా పడుతూ వస్తోంది. ఈ విషయంపై దిల్లీలోని అధిష్ఠానంతో మాట్లాడేందుకు రేవంత్‌రెడ్డి ఇప్పటికే చాలాసార్లు హస్తినలో పర్యటించారు. మరోవైపు రాష్ట్రానికి సంబంధించిన కీలక విషయాలపై హైకమాండ్‌తో చర్చించనున్నట్లు గాంధీభవన్ వర్గాలు భావిస్తున్నాయి. తాజాగా హర్యానా, జమ్మూకశ్మీర్ ఎన్నికలకు ముందే తెలంగాణ క్యాబినెట్‌ను విస్తరించాలని పార్టీ పెద్దలు ఆశించారు. కానీ ఆ? రాష్ట్రాల్లో ఎన్నికలపైనే కాంగ్రెస్ అగ్రనేతలు దృష్టి కేంద్రీకరించడంతో క్యాబినెట్ విస్తరణ సాధ్యం కాలేదు. దీంతో రేపటి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశానికి రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారు. అనంతరం ప్రత్యేకంగా సోనియా, రాహుల్, ఖర్గేలతో సమావేశమై క్యాబినెట్ విస్తరణపై చర్చించనున్నారట. ఫలితంగా కొత్త మంత్రుల జాబితాతోనే తెలంగాణకు తిరుగు



పయనమవుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## సీతక్క, ఉత్తమ్‌లకు కీలక బాధ్యతలు



-మొదటిపేజీ తరువాయి

నియమించారు. కేంద్ర ఎన్నికల సంఘం రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ఇవాళ షెడ్యూల్ వెలువరించనున్న నేపథ్యంలో ఏఐసీసీ పరిశీలకులను నియామకం జరిగింది. తెలంగాణకు చెందిన ఇరువురు మంత్రులకు ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలు అతిపెద్ద బాధ్యతను అప్పగించారు. మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాలలో ఇక ఎన్నికల సందడి నెలకొననున్న నేపథ్యంలో.. కాంగ్రెస్ అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. మహారాష్ట్రలో 288 అసెంబ్లీ స్థానాలకు, జార్ఖండ్ 81 స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఇక కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటనే తరువాయి. అందుకు ముందుగానే ప్రధాన పార్టీలు ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. ఇటీవల జరిగిన జమ్మూ కాశ్మీర్, హర్యానా ఎన్నికలలో జమ్ము కాశ్మీర్ ను కాంగ్రెస్ కూటమి వశం చేసుకోగా.. హర్యానాను బిజెపి దక్కించుకుంది. ఈ రెండు రాష్ట్రాలలో పోటాపోటీగా ప్రచారం సాగించి, ఎన్నికలకు వెళ్లిన కాంగ్రెస్, బిజెపిలకు చెరో ఒక రాష్ట్రం దక్కింది. ఇక తాజాగా మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుండగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ పరిశీలకులను నియమించింది. ఈ మేరకు ఏఐసిసి ప్రకటన జారీ చేయగా.. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ నుండి ఇరువురు మంత్రులపై సరికొత్త బాధ్యతను కాంగ్రెస్ పెద్దలు ఉంచారు. వారిలో రాష్ట్ర మంత్రులు సీతక్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉండగా.. వీరు మహారాష్ట్ర పార్టీ సీనియర్ పరిశీలకులుగా వ్యవహరించనున్నారు. నార్త్ మహారాష్ట్ర కు సీతక్క, మరత్వాడ కు ఉత్తమ్ కుమార్ రెడ్డిలు పార్టీ స్థితిగతులను పరిశీలిస్తూ వాటిని చక్కదిద్దుతారు. అంతేకాకుండా మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాలలో ఎన్నికల నిర్వహణకు ఈసీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే.. ఇక నామినేషన్ ల పర్వం, ప్రచారాల మోతలు ఇక్కడ మ్రోగనున్నాయి. కాగా మహారాష్ట్రకు సంబంధించి ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ అధికారం చేజిక్కించుకొనేందుకు ఎట్టి పరిస్థితుల్లో అన్ని పార్టీలతో కలవాలన్నారు. అందుకు తాను కూడా సహకరిస్తానని, అయితే చర్చలు జరగాలని సూచించారు. హైదరాబాద్ ఎంపీగా గల అసదుద్దీన్ ఓవైసీ చేసిన ఈ వ్యాఖ్యలు పొలిటికల్ హీట్ పెంచాయని చెప్పవచ్చు. అలాగే అక్కడ బీజేపీ ఓటమి కోసం తాను కాంగ్రెస్ కు సహకరిస్తానంటూ ప్రకటన ఇచ్చారు. కాంగ్రెస్ మద్దతు ఇవ్వకుంటే మాత్రం.. ఎంఐఎం దారి వేరుగా ఉంటుందని అసదుద్దీన్ చెప్పారు. ఈ ప్రకటన ఓవైసీ చేసిన కొద్దిరోజులకు కాంగ్రెస్ పార్టీ పరిశీలకులను నియమించడం, అందులో తెలంగాణకు చెందిన ఇరువురు మంత్రులకు చోటు దక్కడం విశేషం. మరి ఓవైసీ సహకారాన్ని మహారాష్ట్రలో కాంగ్రెస్ తీసుకుంటుందా.. లేదా అనేది తేలాల్సి ఉంది. కాంగ్రెస్ అధిష్టానం ఎంఐఎం మద్దతు కోరుకుంటే మాత్రం.. దౌత్యానికి తెలంగాణ మంత్రులను ఉపయోగించే అవకాశం ఉన్నట్లు రాజకీయ విశ్లేషకుల అంచనా.

## ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుంది

-మొదటిపేజీ తరువాయి

ఉచిత సౌకర్యాలు కల్పించాం. 2 లక్షల రూపాయల రుణ మాఫీ, 500 రూపాయలకు గ్యాస్, 200 యూనిట్ల కరెంట్, స్కిల్ యూనివర్సిటీ, అనేక కొత్త విధానాలు అమలు చేస్తున్నామన్నారు. మీరంతా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విరివిగా తీస్కెళ్లాలని పిలుపు నిచ్చారు. ప్రజల మద్దతు ప్రభుత్వానికి సంపూర్ణాంగ ఉండేలా కృషి చేయాలి.. క్షేత్ర స్థాయి లో మరింత లోతుగా పని చేయాలి. రాబోయే ఎన్నిలకలో మనం మరింత గట్టిగా పని చేయాలి. స్థానిక సంస్థల ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు...నియోజకవర్గ నాయకులు కలిసికట్టుగా పని చేయాలి టీపీసీసీ అధ్యక్షులుగా నాకు ఒక పెద్ద బాధ్యత ఇచ్చారు.. నియోజక వర్గ ఇంచార్జ్ లు మంచిగా కలుపుకొని పోవాలి మెదక్ పూర్వ జిల్లాలో మనం మరింత గట్టిగా కృషి చేయాలి నియోజక వర్గ ఇంచార్జ్ భేషజాలకు పోకుండా కలిసికట్టుగా పని చేసి మంచి ఫలితాలు తేవాలి. రాబోయే ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించాలి.. క్రమశిక్షణ అనేది చాలా కీలకం.. క్రమశిక్షణ ఉల్లంగిస్తే ఊరుకునేది లేదు మెదక్ జిల్లా లో మంచి ఫలితాలు సాధించే దిశగా పని చేయాలి.

## గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షకు లైన్ క్లియర్




-మొదటిపేజీ తరువాయి

గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలపై దాఖలైన రెండు పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. గ్రూప్ 1లో తప్పుడు ప్రశ్నలను తొలగించాలని ఒక పిటిషన్ దాఖలవగా.. ప్రిలిమినరీ కీ లో తప్పులు ఉన్నాయని, కీ ని రీ నోటిఫికేషన్ చేయాలని మరో పిటిషన్‌ను అభ్యర్థులు దాఖలు చేశారు. తప్పుడు ప్రశ్నలు తొలగించి మళ్లీ మెరిట్ జాబితాను విడుదల చేయాలని పిటిషనర్లు కోరారు. ఈ పిటిషన్లపై ఈరోజు హైకోర్టులో విచారణ జరిగింది. త్వరలో గ్రూప్ వన్ మెయిన్స్ పరీక్షలు జరగబోతున్నాయని ఈ సమయంలో న్యాయస్థానం జోక్యం చేసుకుంటే మెయిన్స్ విద్యార్థులు నష్టపోతారని టీజీపీఎస్సీ కోర్టుకు తెలియజేసింది. ప్రభుత్వ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు పిటిషన్‌లను కొట్టివేసింది. దీంతో ఈనెల 21 నుంచి గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలు యథావిధిగా జరుగనున్నాయి.

**అందుబాటులోకి హాల్ టికెట్లు...**

మరోవైపు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు అందుబాటులోకి వచ్చాయి. తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు ఈ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ నెల 21 నుంచి 27వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలు రాయనున్నారు. ఈ పరీక్షలను హెచ్ఎండీఏ పరిధిలో నిర్వహిస్తున్నారు. హాల్‌టికెట్లు పరీక్ష ప్రారంభమయ్యే ఒక రోజు ముందు వరకు అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. మెయిన్స్ పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్నాయి. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం 30 నిమిషాల ముందుగా పరీక్ష హాల్‌లోకి చేరుకోవాల్సి ఉంటుంది. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు అభ్యర్థులను అనుమతించనున్నట్టు అధికారులు వెల్లడించారు. ఆ తర్వాత వచ్చే వారిని అనుమతించబోమని స్పష్టంచేశారు. మెయిన్స్‌లో భాగంగా ప్రతి అభ్యర్థి ఆరు పేపర్లకు సంబంధించి పరీక్షలు రాయాల్సి ఉంటుంది.

# రోగులపట్ల నిర్లక్ష్యం తగదు

**ముఖ్యమంత్రికి కోపం ఉంటే మా మీదే చూపించాలిజల మీద కాదు**

**పథకం మార్చిన పరవాలేదు కేసీఆర్ కిట్, కంటి వెలుగు అమలు చేయండి**

**హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**



**హుజురాబాద్, శుభ తెలంగాణ :** వివిధ ప్రాంతాల నుంచి చికిత్స కోసం నిత్యం వందలమంది ప్రభుత్వాసుపత్రికి వస్తుంటారని, వారి ఆరోగ్యం పట్ల ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు,సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సహించేదే లేదని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం హుజురాబాద్ ప్రభుత్వాసుపత్రి ఆకస్మిక తనిఖీ అనంతరం డాక్టర్లు సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణీల పట్ల సోమవారం డాక్టర్లు డెలివరీ నిర్వహించకుండా ఆలస్యం చేయడంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. పేదల ఆరోగ్యం కోసమే ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ ఉంటుందని, ఒక్క రోగి కూడా ఆస్పత్రిలో ఇబ్బంది పడకూడదని అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నప్పుడు ప్రభుత్వాసుపత్రిలో వైద్యం పూర్తిస్థాయిలో అందేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ స్థాయిలో చికిత్స అందడం లేదని అన్నారు. ప్రభుత్వ తీరు చూస్తుంటే దున్నపోతుపై వర్షం పడినట్లుగా ఉందన్నారు. కెసిఆర్ హయాంలో హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకు 200లకు పైగా డెలివరీలు జరిగేవని ప్రస్తుతం ఆస్థాయి గణనీయంగా పడిపోయింది అన్నారు. గత రెండు నెలలుగా ప్రభుత్వ ఆసుపత్రి పై ఒత్తిడి తీసుకురావడంతో డెలివరీల సంఖ్య వందకు పెరిగాయని భవిష్యత్తులో వీటిని 200 పెంచాలని డాక్టర్లకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కోపం ఉంటే కెసిఆర్, బీఆర్ఎస్ నాయకుల మీద తీర్చుకోవాలి తప్పా పేద ప్రజల పైన కాదన్నారు. హుజురాబాద్, జమ్మికుంట ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కొరతగా ఉందని వెంటనే పూర్తిస్థాయిలో సిబ్బందిని నింపాలన్నారు. హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి ఒక గైనకాలజిస్ట్ తో పాటు అనస్తిష్టను వెంటనే కేటాయించాలని, అలాగే జమ్మికుంట కూడా గైనకాలజిస్టు నియమించాలన్నారు. గర్భిణీ స్త్రీలకు న్యూట్రిషన్ కిట్ తో పాటు డెలివరీ అయిన తర్వాత కెసిఆర్ కిట్ ని కూడా అందించాలన్నారు. కెసిఆర్ కిట్ కి పేరును మార్చిన పరవాలేదని, గర్భిణీ స్త్రీలకు గతంలో మాదిరిగానే ఆడపిల్ల పుడితే 13000 మగ బిడ్డ పుడితే 12000 ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే కంటి వెలుగు కార్యక్రమాన్ని కూడా తిరిగి చేపట్టాలన్నారు. డాక్టర్లపై తమకు గౌరవం ఉందని ఆ గౌరవాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఈ తనిఖీల్లో ఎమ్మెల్యే వెంట అడిషనల్ . డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ చందూలాల్, ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారెడ్డి, ఆర్ ఏం ఓ సుధాకర్ రెడ్డి,మున్సిపల్ చైర్ పర్సన్ గందే రాధిక శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, కౌన్సిలర్లు మరపల్లి సుశీల, తొగరు సదానందం, ఉమామహేశ్వర్, వెన్నంపల్లి కిషన్ తాళ్లపల్లి శ్రీనివాస్, కుమార్, సృజన పూర్ణచందర్, బొర్గాల శివకుమార్, నాయకులు ఇమ్రాన్, భాష బోయిన కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఆ' ఐడియా'
## మూగజీవాలకు వరం.



**కమాన్ పూర్ :** ఆ రైతు ఐడియా మూగజీవాలకు వరంగా మారింది. మనకు వర్షాకాలంలో దోమలు కుడితే దోమలను పారదోలెందుకు ఎన్నో ఉపయోగాలు వేస్తాం. మనకు దోమలు కుట్టకుండా ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటాం. కానీ మూగజీవాలకు ఆరు బయట కట్టి వేయడంతో వాటికి దోమలు కుట్టి ఎంతో ఇబ్బందులకు గురవుతుంటాయి. అలాగే పాల శాతం సైతం తగ్గుతుంది. కమాన్ పూర్ మండలం జూలపల్లి గ్రామానికి చెందిన అన్నవేన రాజయ్య అనే రైతు తమ గేదెలకు దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు. దీనిలో భాగంగా తామ గేదెల గుడిసెకు పూర్తిగ దోమల తెర కట్టి వాటికి దోమల కుట్టకుండా జాగ్రత్త తీసుకున్నాడు. మనం సైతం మూగజీవాలకు ఇటువంటి సౌకర్యాలు కలిగిస్తే మూగజీవాల దీవెన సైతం మనకు ఉంటుందని ఆశిద్దాం.

## బెట్టింగ్‌లు ,ఆన్లైన్ గేమ్స్‌లకు బానిసలై దొంగతనాలకు పాల్పడుతున్న యువకులు

**ఇబ్రహీంపట్నం:** చదువుకున్న యువకులు బెట్టింగ్ లు ,ఆన్లైన్ గేమ్స్ లకు బానిసలై దొంగతనాలకు పాల్పడు తుండగా పోలీసులు పట్టుకొని రిమాండ్ కు తరలించారు. ఇబ్రహీంపట్నం ఏసీపి కేపీవీ రాజు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా జాజిరెడ్డి గూడెం మండలం రామన్నగూడెం కు చెందిన ఉటుకూరి ప్రభాస్ తాత్కాలికంగా రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ లో ఉంటూ కరీంనగర్ లో బీటెక్ చదువుతూ ఆన్లైన్ బెట్టింగ్ కు పాల్పడి లాస్ అయ్యాడు, మరొకరు నల్గొండ జిల్లా శాలిగౌరారం గ్రామానికి చెందిన గుండ్లపల్లి శివ మెడికల్ షాప్ వర్కర్ గా పనిచేస్తూ ఆన్లైన్ బెట్టింగ్ ఆడుతూ లాస్ అయ్యాడు. వీరిద్దరూ ఒకరికొకరు ఆన్లైన్ ఇన్స్టా గ్రామ్ లో పరిచయమయ్యారు. సులభమార్గంలో డబ్బులు సంపాదించడం కోసం చోరీ చేయాలని నిర్ణయించు కున్నారు. 10వ తేదీన ఒక బ్లూ కలర్ బేలానో (టీజీ07జీ 8635) ను కిరాయికి తీసుకున్నారు. ఒంటరిగా ఉన్న మహిళలు, వృద్ధుల నివాసాలను రెక్కి నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం ఆకులమైలారం గ్రామంలో ఒంటరిగా వృద్ధురాలు దేవరశెట్టి సుమతమ్మ ఇంట్లోకి ప్రవేశించి ఆమె నోరు మూసి ఒలరు పట్టుకోగా మరొకరు మెడలో, చేతులకు 6 తులాల బంగారు ఆభరణాలు(4-బంగారు గాజులు, రెండు తులాల పుస్తెల తాడు)ను కత్తెరతో కత్తిరించుకొని చోరీకి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గ్రీన్ ఫార్మా సిటీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి చాకచక్యంగా ఇద్దరు నిందితులను ఈ రోజు పట్టుకొని మీడియా ముందు ప్రవేశ పెట్టారు. వారినుండి బంగారు ఆభరణాలు, కారు, ఐ ఫోన్, కత్తెర స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించారు. ఉన్నత చదువులు చదివి ఆన్లైన్ బెట్టింగ్ లకు పాల్పడి సులభ మార్గాల్లో డబ్బులను సంపాదిం చుటకు యత్నించడం మనేయ్యలని సూచించారు. ఎలాంటి నేరం చేసిన పోలీసుల కు చిక్కగా తప్పదన్నారు. చేదు మార్గాల్లో డబ్బులు సంపాదించడం మనేయ్యలని, ఇది తల్లిదండ్రులు, యువకులు గుర్తుంచుకోవాలన్నారు. ఒంటరి మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నిందితులను పట్టుకోవడం లో చాకచక్యంగా వ్యవహరించిన గ్రీన్ ఫార్మా సిటీ సిఐ కృష్ణమ్ రాజు, సిబ్బందిని ఏసీపి అభినందించి రివార్డులను అందజేశారు.

## సిఎంఆర్ లక్ష్యలను నూరు శాతం సాధించాలి



**భూపాలపల్లి, శుభ తెలంగాణ:** సి.ఎం.ఆర్ లక్ష్యాలను నూరు శాతం సాధించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మిల్లర్లను ఆదేశించారు మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో సి ఎం ఆర్, ఖరీఫ్ దాన్యం కేటాయింపు, మిల్లులు ట్యాగింగ్, మార్కెట్ కమిటీ లైసెన్సులు తదితర అంశాలపై పౌర సరఫరాలు, మార్కెటింగ్, సహకార శాఖ, రైస్ మిల్లర్లుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు సి ఎం ఆర్ లక్ష్యం 77.46 శాతం పూర్తి చేశామని, మిగిలిన లక్ష్యాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఖరీఫ్ సీజన్ కు సంబంధించి సి ఎం ఆర్ ప్రక్రియపై కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు మిల్లర్లు మార్కెట్ కమిటి లైసెన్స్ పొందాలని అన్నారు. మిల్లర్లు కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయడం ద్వారా ధాన్యం సేకరణ, బియ్యం సరఫరా సక్రమంగా జరుగుతుందని ఆయన అన్నారు. సి.ఎం.ఆర్ లక్ష్యాలను సాధించడం చాలా ముఖ్యమని, ప్రభుత్వానికి సహకరించడం ద్వారా రైతుల ప్రయోజనాలను కాపాడగలరని కలెక్టర్ తెలిపారు. సి ఎం ఆర్ లో పాల్గొనే ప్రతి రైస్ మిల్లర్ తప్పనిసరిగా రెండు వేర్వేరు రిజిస్టర్లను నిర్వహించాలని అన్నారు. ఏ సమయంలోనైనా పరిశీలనకు అందించాలని పేర్కొన్నారు. దాన్యం కోనుగోలు గురించి మాట్లాడుతూ ట్యాగ్ చేయని కొనుగోలు కేంద్రాల నుండి దాన్యం స్వీకరించొద్దని, కేటాయించిన మేరకు మాత్రమే దాన్యం స్వీకరించాలని తెలిపారు. సన్న రకం, దొడ్డు రకంలో జాగ్రత్తలు పాటించాలని, టోకెన్ కేటాయించాలని తెలిపారు. ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేయడానికి తగినంత స్థలంతో పాటు దిగుమతి చేసేందుకు హమాలీలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, డిఎం రాములు, మార్కెటింగ్ డిఎం కనక శేఖర్, సహకార అధికారి వాలియా నాయక్, రైస్ మిల్లర్లు సంగం అధ్యక్షులు తిరుపతి, రైస్ మిల్లు యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నియంత్రణకు
# కట్టుదిట్టమైన చర్యలు

**విద్యా సంస్థలలో యాంటి డ్రగ్స్ కమిటీల ఏర్పాటు**

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి , శుభ తెలంగాణ :** జిల్లాలో మాదకద్రవ్యాలను నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మాదక ద్రవ్యాల, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా నార్కోటిక్ కంట్రోల్ సమావేశంలో జిల్లాలో నమోదవుతున్న ఎన్.డి.పి.ఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాధక ద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారం వంటి పలు అంశాలను సుదీర్ఘంగా చర్చించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, మోడల్ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో డ్రగ్స్, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై వైద్య అధికారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలోని విద్యా సంస్థలలో యాంటి డ్రగ్స్ కమిటీల ఏర్పాటు చేయాలని, డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాలు అలవాటు ఉన్న వారిని గుర్తించి వారిని పునరావాస కేంద్రాల ద్వారా అలవాటు మానిపించాలని అన్నారు. విద్యా సంస్థల్లో నిర్వహించే పేరెంట్ టీచర్స్ సమావేశాలలో డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు, డ్రగ్స్ గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలు గా మారితే వచ్చే పరిణామా లు, మాదకద్రవ్యాల బానిస త్వం నివారణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన డి అడిక్షన్ సెంటర్ మొదలగు అంశాలను వివరించాలని, పేరెంట్స్ చుట్టుపక్కల ఎవరైనా పిల్లలు మాదక ద్రవ్యాలకు అలవాటు పడినట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందజేయాలని కలెక్టర్ సూచించారు. డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామాల పై అవగాహన వివరిస్తూనే సమాంతరంగా వాటి నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో గంజాయి తో పాటు గుడుంబా నివారణకు సైతం అవసరమైన చర్యలు కచ్చితంగా చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.
మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సిలింగ్ అందించే విధంగా చర్యలు తీసుకోవా లని వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు. గోదావరిఖని ఆసుపత్రిలో 10 పడకల డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని, అవసరమైన వారికి ఇక్కడ చికిత్స అందించాలని కలెక్టర్ సూచించారు. అటవీ శాఖ అధికారులు వారి పరిధిలోని అటవీ భూములు పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. జిల్లా లోని ఆసుపత్రులు, మెడికల్ షాపులలో స్టాక్ వివరాలను ప్రతి నెల తనిఖీ చేయాలని కలెక్టర్ డ్రగ్ ఇన్స్ పెక్టర్ కు సూచించారు. చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బ తింటుంద ని, ఆలోచనా విధానం, ఆలోచ నా శక్తి నశిస్తాయని అన్నారు. భావితరాలు మాదక ద్రవ్యాల పట్ల ఆకర్షితులు కాకుండా వారికి సమాజంలో మంచి, చెడు తెలియ జేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఏసిపి జి. క్రిష్ణ, గోదావరిఖని ఏసీపీ ఏం. రమేష్, జిల్లా అటవీ అధికారి శివయ్య, జిల్లా ఆప్కారి శాఖ అధికారి మహిపాల్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి డి. మాధవి, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్ , జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన , కలెక్టరేట్ పర్యవేక్ష కులు ప్రకాష్, సంబంధిత అధికారులుతదితరులుపాల్గొన్నారు.

## కేసీఆర్‌కు పట్టిన గతే మీకూ...c



**నిజామాబాద్, శుభ తెలంగాణ :** టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నిజామాబాద్ పర్యటన సందర్భంగా స్థానిక ఎంపీ అరవింద్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన రియాక్ట్ అవుతూ కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. మహేష్ గౌడ్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కౌన్సిలర్‌గా కూడా గెలవలేని వారు తన గురించి మాట్లాడతారా అంటూ ఫైరయ్యారు. కాంగ్రెస్ పాలనలో ఆలయాలకు రక్షణ కరువైందని, బీజేపీ అధికారంలోకి వస్తేనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని తెలిపారు. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటేసిన ప్రజలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా వేస్తారని ధీమా వ్యక్తం చేశారు.దేశంలో ఎక్కడా లేనివిధంగా నిజామాబాద్ లోక్ సభ పరిధిలో రైల్వే బ్రిడ్జిలు ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు అరవింద్. 7చోట్ల బ్రిడ్జిల నిర్మాణం జరుగుతోందని, తన వల్లే జిల్లాలో కాంగ్రెస్ వీక్ అయ్యిందని అన్నారు. 93 కోట్ల రూపాయలతో చేపట్టిన మాధవనగర్ ఆర్వోబీ, రోడ్ల విస్తరణ ఇలా నియోజకవర్గానికి చాలా చేశానని వివరించారు ఎంపీ. రాష్ట్ర ప్రభుత్వం నిధుల బిల్లులు సకాలంలో ఇవ్వడం లేదని, రైల్వే రంగాన్ని కాంగ్రెస్ పట్టించుకోలేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం నిధులు డిపాజిట్ చేసినా రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడం లేదన్నారు. మంత్రి కోమటిరెడ్డి అధికారులను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, తన ఫోన్ కూడా లిఫ్ట్ చేయడం లేదని మండిపడ్డారు. జిల్లాకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఎందుకు ఇవ్వలేదని ఈ సందర్భంగా ప్రశ్నించారు అరవింద్. రాష్ట్రంలో బీజేపీ అధికారంలో రాగానే, ఎవరిని ఎక్కడ ఉంచాలో తమకు తెలుసని హెచ్చరించారు.

## గేట్లకు తాళాలు వేసిన వారిపై క్రిమినల్ చర్యలు



**హైదరాబాద్, శుభ తెలంగాణ :** రుకుల పాఠశాల గెట్లకు తాళాలు వేసిన వారి పై క్రిమినల్ కేసులు వేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'దసరా సెలవుల అనంతరం విద్యాశాఖకు సంబంధించి గురుకులాలు, కాలేజీలు , పాఠశాలలు ప్రారంభం అవుతున్నాయి. 70 శాతం గురుకులాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఇది ఈ 10 నెలల్లో పెట్టిన బకాయిలు కాదు.. ఈ విషయాన్ని యజమానులు గమనించాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నాయకత్వంలో వివరాలు తెప్పించుకుని సమావేశాలు కూడా నిర్వహించాం. నేడో రేపో నిధులను ప్రభుత్వం విడుదల చేయబోతుంది. ఈ సమయంలో ఎవరి మాటలో పట్టుకుని కావాలని కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని కోరుతున్నాను. ఇది మంచిది కాదు. ప్రభుత్వం బకాయిలు చెల్లించే ప్రక్రియ కొనసాగుతుంది. గురుకుల మంత్రిగా విజ్ఞప్తి చేస్తున్నా. గురుకులాలకు పెట్టిన బ్యానర్లను వెంటనే తొలగించాలి. విద్యార్థులకు సక్రమంగా తరగతులు నడిపించే విధంగా చర్యలు తీసుకోవాలి. లేదంటే ప్రభుత్వపరంగా చర్యలు ఉంటాయి.పాత బకాయిలు ఇప్పించే బాధ్యత మాది. నేను, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్ని గురుకులాలపై సమీక్ష సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. గురుకుల భవన యజమానులకు విజ్ఞప్తి వెంటనే బ్యానర్లు తొలగించాలి. విద్యార్థులకు స్వాగతం పలకండి. వారి విద్యా బోధనకు ఆటంకం కలిగిస్తే చట్టపరంగా ఎటువంటి చర్యలు ఉంటాయో మీకు తెలుసు. మీకు బకాయిని చెల్లించే బాధ్యత మాది.. లేదంటే నన్ను గానీ, ముఖ్యమంత్రి గారిని గానీ లేదా అధికారులను కలవండి. పాత బకాయిలతో సహా మెస్ ఛార్జీలు మూడు రోజుల క్రితమే చెల్లించాం. గురుకులాలు తాళం వేసి తలుపులు వేస్తే కఠిన చర్యలు ఉంటాయి. గురుకుల ప్రిన్సిపల్, అర్సీవోలు ఎక్కడైనా యజమానులు ఇబ్బందులు పెడితే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదులు చేయండి. క్రిమినల్ చర్యలు తీసుకోండి. కలెక్టర్లకు ఆదేశాలు ఇస్తున్నాం.. ప్రత్యామ్నాయంగా అక్కడి నుంచి ఖాళీ చేసి వేరే భవనాలు చూడండి. బకాయిలు చెల్లించే బాధ్యత మాది' అంటూ మంత్రి పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో మరో దారుణం..

**హైదరాబాద్, శుభ తెలంగాణ :** హైదరాబాద్ నగరంలో మరో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఒక సాఫ్ట్ వేర్ ఉద్యోగినిపై ఆటో డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ దారుణ ఘటన సోమవారం అర్ధరాత్రి గచ్చిబౌలి ప్రాంతంలో జరిగింది. తనపై జరిగిన అఘాయిత్యం గురించి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు.బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి గచ్చిబౌలి ప్రాంతంలోని ఆర్సీ పురంలో ఐటీ ఉద్యోగిని ఆటో ఎక్కింది. అర్ధరాత్రి 2.30 ప్రాంతంలో ఆమె ఎక్కిన ఆటో మసీద్ బండ ప్రాంతానికి చేరుకుంది. ఆ తర్వాత డ్రైవర్ దారి మళ్లించి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అక్కడ ఆమెపై డ్రైవర్ ఆటోలోనే అత్యాచారం చేశాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది.. అనంతరం ఆమెను మసీద్ బండ వద్దే వదిలేసి పోయాడని తెలిపింది.యువతి అమీర్‌పేటలోని ఓ నిర్మాణ సంస్థ కార్యాలయంలో పనిచేస్తుందని సమచారం.. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది..

## రాష్ట్ర వ్యాప్తంగా
## 20 లక్షలకు పైగా సభ్యత్వ నమోదు

**బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

**నిర్మల్ , శుభ తెలంగాణ :** బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా నేడు నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మాజీ ఓఒఅ రాంచంద్రరావ్, క్యాంప్ కార్యాలయం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 20 లక్షలకు పైగా సభ్యత్వ నమోదు జరిగిందని, 50 లక్షల టార్గెట్ ను కూడా త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజుకుమార్ రెడ్డి, రావుల రాంనాథ్, సత్య నారాయణ గౌడ్, అయ్యన్నగారి భూమయ్య, మేడిసెమ్మ రాజు, సామ రాజేశ్వర్ రెడ్డి, వడ్డే రాజేందర్ రెడ్డి, సాదం అరవింద్, అర్జున్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## పోడు రైతుల పంటను
## ధ్వంసం చేసిన ఆటవీ అధికారులు

**ఆసిఫాబాద్, శుభ తెలంగాణ :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో పోడు రైతుల పంటను ధ్వంసం చేశారు అటవీ అధికారులు.. కాగజ్నగర్ మండలం కడంబ గ్రామ సమీపంలోని అటవి ప్రాంతంలో గ్రామస్తులు పోడు వ్యవసాయం చేస్తుంటారు. గత రెండు సంవత్సరాలుగా రైతులను పోడు వ్యవసాయం చేయకుండా అటవిశాఖ అధికారులు అడ్డుకుంటున్నారు. అయినా ఈ సంవత్సరం కంది పంటను సాగు చేస్తుండగా అవి మొలకలెత్తడంతో ఈరోజు ఉదయం అటవీశాఖ అధికారులు మొక్కలను పీకడం ఉద్రిక్తత కు దారి తీసింది... రైతులు అడ్డుకునే ప్రయత్నం చేసినా లాభం లేకుండా పోయింది..తాము భారీగా నష్ట పోతున్నామని విన్నవించుకున్నా అధికారులు

# కొత్త గనుల ఏర్పాటుకు విస్తరణ అనుమతులు మంజూరు చేయాలి

## ఐ ఎఫ్ టి యు ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి వినతిపత్రం



**అక్టోబర్ 15 భద్రాద్రి కొత్తగూడెం , శుభ తెలంగాణ:** మణుగూరులో కొత్త గనుల ఏర్పాటు ఉన్నగనులకు విస్తరణ అనుమతులు మరియు మణుగూరు వరద ముంపు నివారణ చర్యలు చేపట్టడం బాధితులకు, సింగ రేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ ఐ ఎఫ్ టి యు ఆధ్వర్యంలో తెలంగాణ రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కి మంగళవారం సాయంత్రం వినతి పత్రం అందజేసినట్లు ఐ ఎఫ్ టి యు మణుగూరు ఏరియా అధ్యక్షులు అంగోత్ మంత్రాల తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మణుగూరు ఏరియాలో ప్రస్తుతం బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ కొనసాగుతున్న ఓసి గనులు మూత పడ నున్నాయని. కొత్త గనులు ప్రారంభం కాకపోతే మణుగూరు ఏరియా మనుగడ ప్రశ్నార్థకం అయ్యే అవకాశం ఉందని, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మణుగూరులో కొత్త గనుల ఏర్పాటుకు సత్వర చర్యలు చేపట్టాలని ఉన్న గనులకు విస్తరణ అనుమతులు సాధించాలి. అన్ని గనులు సింగరేణి ఆధ్వర్యంలోనే నడిపించాలని. ఉపాధి అవకాశా లు మెరుగుపరచాలని, అదేవిధంగా భారీ వర్షాలు కురిస్తే చాలు మణుగూరు పట్టణాన్ని వరద మంపు ముం చెత్తుతోంది ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అనేకమంది నిరాశయులయ్యారని రాష్ట్ర ప్రభుత్వం మణుగూరుకు పటిష్టమైన వరద ముంపు నివారణ చర్యలు చేపట్టాలి. నిరాశ్రయులకు, బాధితులకు, అర్హులకు ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయాలి. పదవీ విరమణ చేసి మణుగూరులో స్థిరపడాలి ఇంటి నిర్మాణం చేపట్టాలి అనుకునే సింగరేణి కార్మికులకు ఐదు సెంట్ల భూమి కొనుగోలుకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి. ఉన్న నిర్మాణాలకు ఇబ్బందులు లేకుండా చూడాలి. మణుగూరులో ట్రాఫిక్ నియంత్రణ చర్యలో భాగంగా ఆటోనగర్ ఏర్పాటుకు ప్రభుత్వ భూమి కేటాయించాలి అభివృద్ధి పనులు చేపట్టాలి, సింగరేణి భూ నిర్వాసిత కొత్త కొండాపురం కొత్త కొమ్ముగూడెం గిరిజన గ్రామాలకు స్మశాన వాటికకు భూమి కేటాయించాలి సౌకర్యాలు కల్పించాలి, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి, సింగరేణి భూ నిర్వాసితులకు, ప్రభావిత గ్రామాల యువతకు, సింగరేణి డిపెండెంట్ లకు, స్థానికు లకు సింగరేణి ఓబి కంపెనీలలో, సెక్యూరిటీ మరియు ఇతర సివిల్ కాంటాక్ట్ పనులలో ఉపాధి అవకాశాలు కల్పించాలి. కార్యక్రమంలో భాగంగా కాంట్రాక్ట్ కార్మికుల కు ఐదు వేల రూపాయల ప్రోత్సాహక బహుమతి అందిం చిన సందర్భంగా కృతజ్ఞతా భావంగా పూల మొక్కను, బుద్ధుని చిత్రపట జ్ఞాపికతో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ని పివి కాలనీ కమ్యూనిటీ హాల్ లో కాంట్రాక్ట్ కార్మికులు ఘనంగా సత్కరించారు. ధన్యవా దాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ సూపర్వై జర్లు కార్మికులు ఎం హాథిరామ్, రమేష్,డి అనూష, అలివేలి, మేరీ, లక్ష్మి, నిర్మల, సుశీల, ఉపేంద్ర శ్రీరాము లు, రామకృష్ణ, శ్రీనివాస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు

# టిడిపి నుండి బీజేపీలో చేరికలు







**ఖమ్మం, శుభ తెలంగాణ** ఖమ్మం రూరల్ మండలం పెద్ద తండ గ్రామం నుండి బిజెపి గిరిజన మోర్చా జిల్లా కార్యదర్శి భాన్య నాయక్ ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర నాయకులు తాండ్ర వినోద్ రావు సమక్షంలో టిడిపి నుండి చిన్న సైదులు, శంకర్, వాసు, గోపీచంద్, అన్వేష్, వెంకటేష్, శేఖర్, సైదులు, రాము, తదితరులు బిజెపిలో చేరినారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ గత పది సంవత్సరాలుగా ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ ఈ దేశం కోసం చేస్తున్నటువంటి సేవలు అలాగే పేద ప్రజల కోసం తీసుకొస్తున్నటువంటి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ఈ రోజు బీజేపీ రాష్ట్ర నాయకులు తాండ్ర వినోద్ రావు క్యాంప్ కార్యాలయంలో వినోద్ రావు సమక్షంలో బీజేపీ లో చేరడం చాలా సంతోషంగా ఉందని తెలియ జేశారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన కార్యకర్తలను ఉద్దేశించి వినోద్ రావు మాట్లా డుతూ బీజేపీ లో చేరడం చాలా సంతోషమని బీజేపీ కుటుం బంలోకి స్వాగతం పలుకుతూ ఖమ్మం రూరల్ మండలంలో బీజేపీ సభ్యత్వాలను ముసు పెన్నడూ లేని విధంగా చేయాలని, బీజేపీ ని ఒక శక్తిగా ఎదిగేలా చేయాలని, బీజేపీ, మోడీ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని, కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకోసం ఏర్పాటు చేసిన సంక్షేమ ఫలాలు అట్టడుగు స్థాయి కి చేరేలా కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.

## బాలికల ఆశ్రమ పాఠశాల భవనా నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి పొంగిలేటి , ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు





**అక్టోబర్ 15 భద్రాద్రి కొత్తగూడెం , శుభ తెలంగాణ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి కి పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మణుగూరు హనుమాన్ టెంపుల్ నుండి భారీ బైక్ ర్యాలీతో స్వాగతం పలికిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు అనంతరం అంబేద్కర్ సెంటర్ నందు బాలికల ఆశ్రమ పాఠశాల నూతన భవనా నిర్మాణానికి శంకుస్థాపన చేసిన తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి, పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటేల్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలు ఈ యొక్క కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు,మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినకి నవీన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు,మహిళ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక సమావేశం

### అధికారులతో సమీక్ష నిర్వహించిన మండల ప్రత్యేక అధికారి వీర బుచ్చయ్య




**ధర్మారం, , శుభ తెలంగాణ :** ధర్మారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి, డీపీవో వీర బుచ్చయ్య అధ్యక్షతన మంగళవారం మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలో పారిశుధ్య పనుల నిర్వహణ, డోర్ టు డోర్ చెత్త సేకరణ, ఇంటి పన్ను వసూలు, వృత్తి వ్యాపార లైసెన్స్ వసూలు, సెగ్రిగేశన్ షెడ్ ఉపయోగం, అక్రమ నిర్మాణ పనుల నిలిపివేత, మంచినీటి నిర్వహణ, గ్రామ పంచాయతీ రిజిస్టర్ల నిర్వహణ తదితర వాటిపై సమీక్ష నిర్వహించి సంబంధిత అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ధర్మారం ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, మండల పంచాయతీ అధికారి రమేష్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుస్మిత, ఏపీఎం తులసి మాత, అంగన్వాడీ సూపర్వైజర్లు బ్లాండినా, భాగ్యలక్ష్మి, మండల సహాయక ఇంజనీర్, ఉపవాస్తు శాస్త్ర అధికారి, ఆర్డబ్ల్యూఎస్ మంథని, మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, జీపీ కార్యదర్శులు, ఈ-పంచాయతీ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం ఇరిగేషన్ ఎస్ఈగా మంగళంపూడి వెంకటేశ్వర్లు

### ఉత్తర్వులు జారీ చేసిన ఇరిగేషన్ ఇంజనీర్ ఇన్ చీఫ్ అడ్మిన్



**ఖమ్మం , శుభ తెలంగాణ:** ఖమ్మం ఇరిగేషన్ ఎస్ఈగా మంగళంపూడి వెంకటేశ్వర్లు పూర్తి బాధ్యతను స్వీకరిస్తు న్నట్లు ఇరిగేషన్ ఇంజనీర్ ఇన్ చీఫ్ అడ్మిన్ అనిల్ కుమార్ మంగ ళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఈ నర్సింగరావు సెలవులపై వెళ్లడంతో ఇరిగేషన్ ఈఈ గా విధులు నిర్వహిస్తున్న మంగళం పూడి వెంకటేశ్వర్లకు ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

## అడ్వాన్సుడ్ ట్రైనింగ్ సెంటర్లో ప్రవేశాలు....



**భద్రాద్రి కొత్తగూడెం, శుభ తెలంగాణ:** మణుగూరు ప్రభుత్వ ఐటిఐ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ లో ఏర్పాటుచేసిన 6 కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతున్నట్లు మణుగూరు ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ బడుగు ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువతకు మరింత ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటుచేసిన అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్లో అత్యధిక కోర్సుల్లో ఈ విద్యా సంవత్సరానికి ప్రవేశాలు జరుగుతున్నట్లు తెలిపారు. మణుగూరు ఏటీసీ కేంద్రంలో ఏర్పాటుచేసిన కోర్సులలో మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్(1 సంవత్సరం), ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్(1 సంవత్సరం), ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్స్ (1 సంవత్సరం), బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్ ( మెకానికల్) (2 సంవత్సరాలు ), అడ్వాన్స్ సి ఎన్ సి మిషనింగ్ టెక్నీషియన్(2 సంవత్సరాలు ), మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికల్ (2 సంవత్సరాలు), కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతున్నట్లు తెలిపారు. పదో తరగతి పూర్తి చేసుకున్న వారు. ఈ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు అన్నారు. ప్రవేశం పొందదలిచినవారు. హెచ్ హెచ్టిటిపి://ఐటిఐ. తెలంగాణ. గౌ. ఇన్ లో ఆన్లైన్ చేసుకొని తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా మణుగూరు ప్రభుత్వ ఐటిఐ కి వచ్చి ప్రవేశం పొందగలరు. ఈ అవకాశాన్ని పినపాక నియోజకవర్గం లోని యువతి యువకులు సద్వినియోగం చేసుకొని మీ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని తెలిపారు.

## ఏజెన్సీలో ఇందిరమ్మ కమిటీలు వేయకూడదు



**నార్నూర్ , శుభ తెలంగాణ** ఆదివాసులు నివసించే ఏజెన్సీ ప్రాంతంలో ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయకూడదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ప్రధాన కార్యదర్శి అర్క గోవింద్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేస్తే ఆదివాసీ సంఘాలతో కలిసి ఉద్యమి స్తామని తెలిపారు. సమావేశంలో సేడ్మకి వినోద్ పాల్గొన్నారు.

## ప్రభుత్వం కులగణనకు జీవో జారీ చేయడం హర్షనీయం

### కాంగ్రెస్ పార్టీ జుజ్జుల్ రావు పేట గ్రామ శాఖ అధ్యక్షుడు కణతల నాగయ్య



**ఖమ్మం, శుభ తెలంగాణ** తెలంగాణ రాష్ట్రంలో వచ్చే 60 రోజుల్లో సమగ్ర కులగణన చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 18 ను జారీ చేయడం పట్ల కాంగ్రెస్ పార్టీ జుజ్జుల్ రావు పేట గ్రామ శాఖ అధ్యక్షుడు కణతల నాగయ్య హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన మాటకు కట్టుబడి 60 రోజుల్లోనే కులగణన చేపట్టడానికి ప్లానింగ్ డిపార్ట్మెంట్ నుఎంచుకోవడాన్ని స్వాగతిస్తున్నా మన్నారు. ఇది బీసీల పోరాట విజయంగా భావిస్తున్నామన్నారు. సమగ్ర కులగణనకు జీవో విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డికి సమస్త బీసీ సమాజం తరఫున ధన్య వాదాలు తెలుపుతున్నట్లు ఆయన ప్రకటించారు.తెలంగాణ రాష్ట్రంలో జరిగే కులగణను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## నీరుపేదలకు వంట సామగ్రి, చీరలు,దుప్పట్లు పంపిణీ






**ఖమ్మం , శుభ తెలంగాణ)** పాలేరు నియోజకవర్గం,ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ, వరంగల్ క్రాస్ రోడ్. ఇటీవల వరద ముంపునకు గురైన జలగం నగర్ కి చెందిన నిరుపేద పది కుటుం బాలకు ఉమ్మనేని సేవ ఫౌండేషన్ ఫౌండర్స్ దామ స్వరూప,కోటేశ్వరరావు వారిచే పాలేరు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు భూక్యా సురేష్ నాయక్ లు మంగళవారం వరంగల్ క్రాస్ రోడ్ నందు నిరుపేదలకు వంట సామగ్రి, దుప్పట్లు,చీరలు పంపిణీ చేయ డం జరిగింది.నిరుపేదలు ఉమ్మి నేని సేవ ఫౌండేషన్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియ జేయడం జరిగింది.ఈ కార్యక్ర మంలో ఖమ్మం జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాళ్ళు బండి బేబీ,రాయల కృష్ణవేణి, గన్నోజు గోవిందమ్మ, అబ్బోజు వర్షిత తదితరులు పాల్గొన్నారు.

# భోజనం చేసిన తర్వాత ఒక చెంచా నిమ్మరసం తాగితే?



భోజనం చేసిన తర్వాత ఒక గ్లాసు నిమ్మరసం తాగడం ద్వారా మీ శ్వాసను తాజాగా ఉంచుతుంది. నిమ్మకాయ నీరు నోరు పొడిబారకుండా నిరోధించడంలో సహాయపడుతుంది. అలాగే, నిమ్మకాయల్లోని సిట్రిక్ యాసిడ్ కాల్షియం కిడ్నీలో రాళ్లను నివారిస్తుంది. నిమ్మకాయలలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యానికి, అలాగే మెదడు, నరాల పనితీరుకు మంచిది. ఇది మీ కీళ్లలోని యూరిక్ యాసిడ్‌ను తొలగిస్తుంది. బరువు తగ్గాలని చాలా మంది ఉదయాన్నే పరగడుపున లెమన్ వాటర్ తాగుతుంటారు. కానీ, మీరు భోజనం చేసిన తర్వాత కూడా లెమన్ వాటర్ తాగొచ్చునని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. తిన్న వెంటనే నిమ్మరసం తాగటం వల్ల మీ జీర్ణక్రియ సాఫీగా సాగుతుంది. ఇది మీ జీర్ణక్రియ వేగాన్ని మెరుగుపరుస్తుంది. దీంతో మీకు జీర్ణ రసాలు, ఎంజైమ్‌ల ఉత్పత్తి పెరుగుతుంది. దీనివల్ల మీకు జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం తగ్గుతుంది. నిమ్మకాయలు సిట్రస్ పండ్లు. వీటిలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు రకరకాల పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇది మన ఇమ్యూనిటీ పవర్ ను పెంచుతాయి. ఇది శరీర స్థాయిని సమతుల్యం చేయడానికి బాగా సహాయపడుతుంది. తిన్న తర్వాత లెమన్ వాటర్ ను తాగితే గ్యాస్ట్రిక్ యాసిడ్ సమస్యను తగ్గిస్తుంది. అలాగే చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచే కొల్లాజెన్ ఉత్పత్తిని కూడా పెంచుతుంది. తిన్న తర్వాత లెమన్ వాటర్ తాగితే చర్మం అందంగా మెరిసిపోతుంది. నిమ్మకాయలో యాంటీ ఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరంలో ఆక్సీకరణ నష్టం లేదా ఒత్తిడిని తగ్గిస్తుంది. అలాగే మనల్ని ఆరోగ్యంగా ఉంచడానికి ఎంతగానో సహాయపడుతుంది. నిమ్మకాయ ఆమ్లంగా ఉన్నప్పటికీ.. ఇది గ్యాస్ ను తగ్గించడానికి బాగా సహాయపడుతుంది. నిమ్మకాయ వాటర్ గ్యాస్ట్రోఇంటెస్టినల్ రిఫ్లక్స్ వ్యాధి నుంచి కూడా ఉపశమనాన్ని కలిగిస్తుంది. లెమన్ వాటర్ ఒక గొప్ప డిటాక్స్ డ్రింక్. ఇది మన శరీరం నుంచి టాక్సిన్స్, హానికరమైన కణాలను బయటకు పంపడంలో చాలా ఎఫెక్టీవ్ గా పనిచేస్తుంది. అలాగే ఇది రక్తాన్ని శుద్ధి చేయడానికి కూడా సహాయపడుతుంది. రోజూ భోజనం చేసిన తర్వాత గోరువెచ్చని నీటిలో నిమ్మరసాన్ని కలుపుకుని తాగితే .. శరీరంలో పేరుకుపోయిన కొలెస్ట్రాల్ తగ్గుతుంది. అలాగే అధిక రక్తపోటు కూడా నియంత్రణలో ఉంటుంది.

# మస్కిటో కాయిల్ వాడుతున్నారా..?



మస్కిటో కాయిల్స్ నుంచి వెలువడే పొగ ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగిస్తుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఈ పొగను పీల్చడం సిగరెట్ తాగినట్లే. ఎందుకంటే ఈ కాయిల్‌లో అనేక రకాల రసాయనాలను ఉపయోగిస్తారు. ఈ పొగ నేరుగా ఊపిరితిత్తులలోకి చేరి శరీరానికి హాని కలిగిస్తుంది. దీర్ఘకాలం ఉండే ప్రభావాలను కూడా కలిగి ఉంటాయి. మస్కిటో కాయిల్ నుంచి వెలువడే పొగ పీల్చుకోవడం వల్ల ఊపిరితిత్తులు దెబ్బతినే అవకాశం ఉంది. మస్కిటో కాయిల్స్‌లోని సమ్మేళనాలు తలనొప్పిని కూడా ప్రేరేపిస్తాయి. అందుకే చాలామందికి దోమల నివారణ మందు వాసన చూస్తే తలనొప్పి వస్తుంది. ఇది అనేక శ్వాస సంబంధ సమస్యలకు దారితీస్తుంది. మస్కిటో కాయిల్స్ నుంచి వెలువడే పొగ కారణంగా కొందరికి ఆస్తమా రావచ్చు. ఈ పొగ అత్యంత విషపూరితమైనదని, మెదడును కూడా దెబ్బతీస్తుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అలాగే చాలా మందికి స్కిన్ అలర్జీలు రావచ్చు. దీని పొగ వల్ల పిల్లలో శ్వాసకోశ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. మస్కిటో కాయిల్ ద్వారా చర్మంపై దద్దుర్లు వచ్చే అవకాశం ఉంది. ఎలర్జీ సమస్య ఉన్నవారు ఈ పొగకు దూరంగా ఉండటమే మంచిది. మస్కిటో కాయిల్స్ పర్యావరణంపై కూడా చెడు ప్రభావం చూపుతాయి. దీని నుంచి వెలువడే విషపూరిత పొగలు గాలిని కలుషితం చేస్తాయి. దోమలను నివారించడానికి ఉపయోగించే మస్కిటో కాయిల్స్‌లో క్యాన్సర్ కారకాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు కారణమవుతాయి. ఇంట్లో పిల్లలు ఉంటే వీలైనంత వరకు మస్కిటో కాయిల్స్ వాడటం మానేయండి. దోమలను నివారించడానికి సహజ మార్గాలు ఎంచుకోండి. దోమ తెరలు మీరు పడుకునే బెడ్ చుట్టూ కట్టుకోండి. లేదంటే సహజంగా దోమలను తరిమేసే మార్గాలు చాలా ఉన్నాయి. వాటిని ఫాలో అవ్వండి.

## ఆవాలు తింటే ఇన్ని లాభాలా..?



ఆవాలు తీసుకోవడం వల్ల దగ్గు, జలుబు వంటి సమస్యలు తగ్గుతాయి. క్రమం తప్పకుండా ఆవాలని తీసుకుంటే దగ్గు, జలుబు వంటి సమస్యలున్నా దూరం పెట్టొచ్చునని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు.. ఆవాల్లో పొటాషియం, కాల్షియంలు ఎక్కువగా ఉంటాయి. ఇవన్నీ కూడా ఎముకల ఆరోగ్యానికి, కీళ్ళ ఆరోగ్యానికి చాలా మంచిది. ఆవాల్లో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ సమృద్ధిగా ఉంటాయి. ఆవాలు తీసుకోవడం వల్ల బీపి కంట్రోల్ అవుతుంది. అంతేకాకుండా శరీరంలో మంచి కొలస్ట్రాల్ పెరుగుతుంది. వీటన్నింటి కారణంగా ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది. గుండె ఆరోగ్యం కూడా మెరుగవుతుంది. ఆవాల్లో సెలీనియం ఎక్కువగా ఉంటుంది. ఆవాలు తీసుకోవడం వల్ల థైరాయిడ్ పనితీరు సరిగ్గా ఉంటుంది. థైరాయిడ్ జీవక్రియకి హెల్ప్ అవుతుంది. కాబట్టి, ఆవాలు, ఆవపిండి, ఆవనూనెని డైట్‌లో కచ్చితంగా యాడ్ చేసుకునేలా చూడండి. ఆవాల్లో కొన్ని గుణాలు క్యాన్సర్ కణాలను పెరగకుండా చూస్తాయి. దీంతో కొన్ని రకాల క్యాన్సర్స్ రాకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు. ఆవాల్లో రిచ్ న్యూట్రియెంట్స్ ఉంటాయి. ఇవి మీ చర్మం మెరిసేలా చేయడమే కాకుండా జుట్టుకు బలాన్నిస్తాయి.

# ఖర్జూరాన్ని పాలతో కలిపి తాగితే ఈ సమస్యలన్నీ పరార్!

ఖర్జూరం కలిపిన పాలు తాగడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. ఖర్జూరాల్లో పాలు కలిపి తీసుకుంటే చలిలో ఉపశమనం ఇస్తుంది. ఖర్జూరం, పాలు శరీరానికి చాలా మేలు చేస్తాయి. పాలు, ఖర్జూరంతో కలిపి తాగడం మంచిదని ఆరోగ్య నిపుణులు పదే పదే చెబుతున్నారు. ఈ రెండింటి కలయిక చాలా శక్తివంతమైనదిగా చెబుతున్నారు. రెండింటిలోనూ పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. రాత్రిపూట ఖర్జూరం కలిపిన పాలు తాగడం వల్ల శరీరంలో శక్తిని కాపాడుతుంది. ఖర్జూరం పాలతో కలిగే లాభాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.. పాలతో ఎండు ఖర్జూరాలను తీసుకుంటుంటే రోగనిరోధక శక్తి పెరిగి పవర్ బూస్టరులా పనిచేస్తుంది. చర్మానికి కూడా కొత్త కాంతినిస్తుంది. రక్తం లోపాన్ని తొలగిస్తుంది. రక్తపోటును నియంత్రించే శక్తి ఖర్జూరాలనుకున్నాయి. దంతాలు, ఎముకలకు మేలు చేస్తాయి.. ఖర్జూరంలో సహజమైన చక్కెర ఉంటుంది. ఇది శరీరానికి తక్షణ శక్తిని అందిస్తుంది. పాలలో ఉండే ప్రొటీన్లు శరీరాన్ని ఎక్కువ కాలం శక్తివంతంగా ఉంచుతాయి. పాలు కాల్షియం మంచి మూలం. ఇది ఎముకలను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. ఖర్జూరంలో మెగ్నీషియం ఉంటుంది. ఇది కాల్షియంను గ్రహించడంలో సహాయపడుతుంది. ఖర్జూరంలో ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఇది మలబద్ధకం సమస్యను దూరం చేయడంలో కూడా సహాయపడుతుంది. పాలు జీర్ణవ్యవస్థను కూడా శాంతపరుస్తాయి. ఖర్జూరంలో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. పాలలో ఉండే లాక్టిక్ యాసిడ్ చర్మాన్ని మృదువుగా, మెరిసేలా చేస్తుంది. చర్మం మెరుస్తూ ఉండాలంటే తరుచుగా ఖర్జూరాతో పాటు పాలు కలిపి తీసుకోవడం మంచిది. ఖర్జూరం, పాలు తీసుకోవడం మంచి నిద్రకు సహాయపడుతుంది. రక్తహీనత సమస్యను తొలగిస్తుంది. గర్భిణీ స్త్రీలకు కూడా ఎంతో మంచిది అంటున్నారు నిపుణులు. కొన్ని ఖర్జూరాలను రాత్రి పాలలో నానబెట్టండి. ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఈ ఖర్జూరా పాలతో కలిపి తినండి. మీకు ఏదైనా రకమైన అలర్జీ ఉంటే ఖర్జూరం, పాలు తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించండి. డయాబెటిక్ పేషెంట్స్ షుగర్ తీసుకోవడం నియంత్రణలో ఉండాలి. ఖర్జూరాన్ని ఎక్కువ మోతాదులో తినడం వల్ల ఊబకాయం పెరుగుతుంది.




## పైనాపిల్ తింటే క్యాన్సర్ రాదా?

పైనాపిల్ జీర్ణక్రియ సక్రమంగా పనిచేయడంలో సహాయపడుతుంది. ఇది జుట్టు రాలడం తగ్గించడంలో సహాయపడుతుంది. రక్త నాళాల్లో రక్తం గడ్డకట్ట కుండా కాపాడుతుంది. ఆడవారికైతే నెలసరి సక్రమంగా వచ్చేందుకు తోడ్పడుతుంది. పండిన పైనాపిల్ పండును తింటుంటే పళ్ళ నుండి రక్తం కారే స్కర్వే వ్యాధి రాకుండా రక్షణ కలిగిస్తుంది. పూర్తిగా పండని పైనాపిల్ రసం తీసుకుంటే కడుపులో పురుగులు చచ్చిపోతాయి. జ్వరం, కామెర్ల వంటి అనారోగ్యాలలో ఉన్న వారికి పైనాపిల్ జ్యూస్ తాగించటం ఎంతో మంచిది. పైనాపిల్ పండు రసాన్ని ముఖానికి రాసుకుని మర్ధన చేస్తే ముఖ చర్మం కోమలంగా, అందంగా మారుతుంది. పండులోని ఎంజైములు ముఖ చర్మంలో నశించిన కణాలను తొలగిస్తాయి. అంతే కాకుండా నల్లటి మచ్చలను తొలగిస్తుంది. పైనాపిల్‌లోని ఎంజైమ్స్ వాపులను, నాసికా సంబంధమైన వ్యాధులను, టైఫాయిడ్‌ని ఉప శమనం చేస్తుంది. పచ్చి పైనాపిల్ రసాన్ని తెగిన గాయా లపై వేస్తే రక్తస్రావం అరికడుతుంది. పైనాపిల్ రసాన్ని పచ్చకామెర్ల వ్యాధి, కాలేయ వ్యాధులున్నవారు ప్రతిరోజు ఈ రసాన్ని తాగితే మంచి ఫలితాలన్ని ఇస్తుంది. పైనాపిల్‌లో ఉన్న ఫైబర్ కంటెంట్ అనేది మలబద్ధకం తగ్గించడానికి సహాయపడుతుంది. పైనాపిల్‌లో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువ మోతాదులో ఉండటం వల్ల.. కంటి సమస్యలు దరిచేరకుండా చూస్తుంది. ఇందులో బీటా కెరోటిన్ కూడా సమృద్ధిగా ఉంటుంది. కంటిచూపు బాగుండటానికి ఇది ఉపయోగపడుతుంది.



# మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే



సైలెంట్ కిల్లర్.. గుండెపోటు కేసులు భారీగా పెరుగుతున్నాయి.. ఇటీవల, ముఖ్యంగా యువతలో కూడా గుండెపోటు మరణాల కేసులు పెరిగాయి. ముఖ్యంగా.. జీవనశైలి.. అనారోగ్యకరమైన ఆహారం, శారీర శ్రమ లేకపోవడం ఇవన్నీ కూడా గుండెపోటుకు కారణంగా చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు.. ప్రస్తుతం చిన్నా పెద్దా అనే తేడా లేకుండా గుండె సమస్యలు, గుండెపోటు వస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.. ముఖ్యంగా, ఇటీవల జిమ్‌లలో వ్యాయామం చేస్తూ చాలా మందికి ఒక్కసారిగా గుండెపోటు బారిన పడటం ఆందోళన కలిగించే అంశంగా మారింది.. వీటికి సంబంధించిన కొన్ని వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. అందుకే గుండెపోటు రాకుండా ఉండేందుకు ఎలాంటి సేఫ్ స్టెప్స్ తీసుకోవాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం.. కార్డియాలజిస్టుల ప్రకారం, చక్కెర, ఉప్పు తక్కువగా తీసుకోవడం గుండె ఆరోగ్యానికి మంచిది. వారానికి ఒకసారి ఉపవాసం లేదా రోజుకు ఒకసారి తినడం మంచిది. మంచి నిద్ర గుండె జబ్బులను నివారిస్తుంది. నిద్రలేమి గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి గుండెను సురక్షితంగా ఉంచుకోవడానికి 6 నుంచి 8 గంటల నిద్ర – క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం చాలా ముఖ్యం. ఉదయం, సాయంత్రం వేళల్లో నడక, శారీరక శ్రమ మంచిదంటున్నారు.. గుండెపోటు ప్రమాదాలను తగ్గించడానికి జీవనశైలి మార్పులు తప్పనిసరి. తినడం, నిద్రపోవడం.. మేల్కొనే సమయం మధ్య సమతుల్యతను కాపాడుకోవడం చాలా ముఖ్యమంటున్నారు ఆరోగ్య నిపుణులు.. మార్కెట్‌లో చౌకగా లభించే ఫాస్ట్ ఫుడ్ పిల్లలు, పెద్దలకు హానికరం. గుండెపోటు వంటి తీవ్రమైన సమస్యలను నివారించడానికి సమతుల్య, సాధారణ ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం... ఇంట్లో వండిన ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవడం చాలా మంచిది.. ధూమపానం, పొగాకుకు దూరంగా ఉండండి.. ఆరోగ్యకరమైన బరువును నిర్వహించాలి.. ఒత్తిడి లేకుండా కుటుంబంతో ఆనందంగా గడపాలి.. అంతేకాకుండా రెగ్యులర్ హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలను చేయించుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

Edited, Printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana. Corporate Office : RamaKrishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com Cell : 7799911110